**దేవస్థానపు** ప్రాంగణం ప్రశాంతంగా, గంభీరంగా ఉంది.

ఓ టూరిస్టు బస్సు దూసుకుంటూ వచ్చి ప్రాంగణం ముందు ఆగింది. అందులోంచి ఓ బాలికల బృందం బిలబిలమంటూ దిగింది. అందరూ ఎనిమిది నించి పదహారేళ్ళ వయస్సులో ఉన్నారు.

రంగు రంగుల గౌన్లలో, పరికిణీ వోణీల్లో చెంగు చెంగున లేడి కూనల్లా గెంతుతూ మెట్లెక్కుతున్నారు. గూడు విడిచిన పక్షి పిల్లల్లా కిలకిల నవ్వుతూ, గలగల మాట్లాడుతూ మెట్లెక్కడంలో ఒకరితో ఒకరు పోటీలు పడుతున్నారు.

వెనగ్గా- గాంభీర్యం ఉట్టిపడుతూ మౌనంగా నడిచి వస్తున్న సూపర్నెంటమ్మగారు-"ఏమిటర్రా అంత గొడవ? కాస్త జాగ్రత్తగా ఎక్కండి మెట్లు...జారి పడిపోగలరు" అంటూ మధ్య మధ్య హెచ్చరిస్తున్నారు.

'బాలసదనం' బాలికలు ప్రత్యేక దర్శనం చేసుకోవడానికి ముందుగానే పర్మిషన్ తీసుకోవడం జరిగింది. అందుచేతనే ఓ చెట్టు కింద తాపీగా నించొని పిల్ల లందరూ చేరుకున్నట్టు నిర్ధారించుకుందుకు అందర్నీ వరసలో నిలబెట్టి లెక్క బెట్ట సాగింది సూపర్నెంటు హేమలత.

"హల్లో హేమా డియర్! ఐ యామ్ సో హేప్పీ టు సీ యు!" హేమలత భుజమ్మీద చేతితో ఆప్యాయంగా, చనువుగా తడుతూ పలకరించింది తారాదేవి వెనకగా వచ్చి.

అటుగా తిరిగి ఉన్న హేమలత చటుక్కున ముందుకు తిరిగి స్నేహితురాల్ని సంభ్రమంగా చూస్తూ అంది. "వెరీ గుడ్ మార్నింగ్, తారా! సరిగ్గా సమయానికొచ్చేశావు. చాలా సంతోషం."

"ఆ... ఏం సమయానికి రావడం. అంత దూరం నించి నా కన్న మీరే ముందొచ్చారు. ఇంత దగ్గర్లో ఉండికూడా ఆలస్యంగా వచ్చాను. చూడు మరి నా ఘనత!"

"ఆలస్య మేమీ లేదు లేవోయ్! అయినా, దూరాన ఉన్న వాళ్ళే ఎప్పుడయినా ముందుగా చేరుకుంటారు చేరవల సిన చోటుకు. స్టేషను పక్కనే ఉంట్నున్న వాళ్ళకి రైలందక పోవడం మామూ లేగా! దాని కేం గాని, మే మొచ్చి కూడా జస్టు పది నిమిషాలే అయ్యింది. పద- అలా ముందు కెళ్ళి పిల్లల్ని లెక్క బెడదాం."



పిల్లలు క్యూలో నిలబడుతున్నారు. వాళ్ళని ఎత్తుల ప్రకారం నిలబెడుతూ క్యూని సరిచేస్తూ ముందుకీ వెనకకీ నడుస్తోంది తారాదేవి. అలా నడుస్తూ నడుస్తూ హఠాత్తుగా ఓ పిల్ల పక్కన ఆగిపోయింది. ఆ పిల్ల ముఖంలోకి పరిశీలనగా చూస్తూ-"హేమా! ఈ అమ్మాయి పేరేమిటి? నే నో పిల్లని ఎనిమిదేళ్ళ క్రితం మీ బాలసదనంలో చేర్పించాను. అప్పు డది ఆరేళ్ళది. దాని పోలికలు ఈ పిల్లలో కనబడుతున్నాయి. నేను చేర్పించిన పిల్ల ఈ అమ్మాయే ననుకుంటా!" వర్ధ్నాలుగేళ్ళున్న ఆ అమ్మాయిని కింది నించి పై వరకూ చూస్తూ ప్రశ్నించింది తార.

"ఎవరూ? ఆ... శ్యామలా? మీ సమితి ఏరియా నించే వచ్చిందని విన్నాను. కేసు షీటులోకూడా అలాగే ఉంది. ఎనిమిదేళ్ళ కిందట నే నీ హోముకి రాలేదుగా. నువ్వే చెప్పాలి మరి... ఆ పిల్లే ఈ శ్యామ లవునో, కాదో?!" నవ్వుతూ అంది హేమ.

"పేరేమి టన్నావ్? శ్యామలా? ఆ... ఆ... ఇప్పుడు గుర్తు కొస్తోంది. నేను చేర్పించిన పిల్ల పేరు శ్యామలే... అరె... ఎంత పెద్ద దయింది! అందంగా కూడా తయారయింది సుమా!" అలా అంటూనే ఒక్కసారిగా శ్యామల్ని రెండు చేతుల్లోకి తీసుకుని గట్టిగా గుండెల కదుముకుంది తార. "సందేహం లేదు. నేను చేర్పించిం దీ పిల్లనే. హేమా! చిన్నప్పుడు మాక్వార్టర్సు పక్కనే ఉన్న గుడి సెల్లో తిరుగుతూ కనబడేది. బొద్దుగా, పచ్చగా బంతిలా ఉండేది. ఇంటింటికీ తిరుగుతూ అన్నం పెట్టమని ఏడ్చేది. ఒకసారి మా ఇంటి కొస్తే పిల్ల ఎవరి తాలూకు దని వాకబు చేశాను. తల్లీ తండ్రీ ఇద్దరూ పోయారనీ, చేరదీసే దగ్గరి బంధువులుకూడా ఎవరూ లేరనీ తెలిసింది. ఆ గుడి సెల వాళ్ళే ఆ పిల్లతో ఆ పనీ ఈ పనీ చేయించుకుని ఓ ముద్ద వేస్తున్నారని తెలుసుకోగానే పట్టు బట్టి మన బాలసదనంలో చేర్పి వచ్చాను."

"చాలా మంచి పని చేశావు, తారా! నీ పుణ్యం వల్లనే శ్యామల ఇప్పు డింత దయి, చక్కగా చదువుకుంటున్నది." మనస్ఫూర్తిగా అభినందించింది హేమ స్నేహితురాలిని.

హఠాత్తుగా తనని గుండెలకు హత్తుకున్న గొప్ప ఉద్యోగినివైపు బెదురుగా, ఆశ్చర్యంగా చూచింది శ్యామల. ఎదురు చూడని అంతటి ఆప్యాయతకు చలించిపోయింది.

"ఏమ్మా శ్యామలా! గుర్తున్నానా నేను? ఎలా ఉంటాన్లే. ఎనిమి దేళ్ళయింది కదా నువ్విక్కడకొచ్చి. అప్పుడు మరీ పసిదానివి." శ్యామల ముఖాన్ని మళ్ళీ రెండు చేతుల్లోకి తీసుకుని బుగ్గమీద ముద్దు పెట్టుకుంది తారాదేవి.

తన హోమ్‌లో పెరుగుతున్న ఓ అనాథ బాలిక పట్ల తన స్నేహితురాలు చూపుతున్న వాత్సల్యానికి మొదట్లో ఒకింత చకితురా లయినా, తరవాత ముగ్ధురా లయింది హేమ.

పిల్లలు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

స్నేహితురా ళ్ళిద్దరూ శ్యామలకి సంబంధించిన ముచ్చట్లలో పడ్డారు.

శ్యామల తల్లి బ్రాహ్మణ యువతి అట. ఆజానుబాహుడూ, అందగాడూ అయిన ఒక ఎరుకల యువకునితో లేచి వచ్చిందట. శ్యామల పుట్టి, ఏడాది పిల్లగా ఉన్నప్పుడు శూలనొప్పి వచ్చి అతను మరణించాడట. దాంతో నడుము విరిగిపోయినట్టయి, మతి పోగొట్టుకున్న శ్యామల తల్లి నాలుగేళ్ళొచ్చే వరకూ ఎలాగో ఆ పిల్లని పెంచి, బిడ్డమీద కంటే తన ప్రియతముడి మీదనే ప్రేమ ఎక్కువ అవడంతో అతణ్ణి వెదుక్కుంటూ వెళ్ళిపోయిందట—ఎవరూ చూడలేని లోకాలకు. ఇంకా తనకి తెలిసిన వివరాలన్నీ హేమకి వినిపించింది-తార.

స్నేహితురా ళ్ళిద్దరూ ఉత్సాహంగా పిల్లలందరికీ దైవ దర్శనం చేయించారు. పూజారి ఇచ్చిన కొబ్బరి చిప్పల్ని ప్రాకారపు గోడమీద చితగ్గొట్టి అందరికీ ప్రసాదం పంచారు.


ఆలయ ప్రాంగణం పాలరాతి తాపడంతో పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంది. ప్రాకారపు గోడల వారగా పొన్న, పున్నాగలు, పచ్చగన్నేరు, ఎర్ర



పెద్ద కథ

# మాకు రావు సూర్యోదయాలు

నంబూరి పరిపూర్ణ




గన్నేరులు విరబూచి, ఉండి ఉండీ వీచే పిల్లగాలుల తాకిడికి తల లూగిస్తూ ప్రాంగణాని కంతా ఒక వింత శోభను, పవిత్రతను సంతరిస్తున్నాయి.

గుడికి నలువైపులా పాలరాతి చప్టా పరచుకుని ఉంది. ఎడమ వైపు నున్న చప్టా మీద రెండు వరుసల్లో ఎదురు బొదురుగా కూర్చున్నారు పిల్లలు. బాలసదనంలోనే తయారు చేయించి తెచ్చిన పులిహోర, దద్దోజనం గుండిగల్ని బస్సులోంచి దించి, చప్టా మీదకి చేర్చారు హోమ్ జవాన్లు. కొన్ని పెద్ద పిల్లల సహాయం తీసుకుంటూ తారాదేవి, హేమలతలు పిల్ల లందరి ముందూ అరిటాకులు వేసి ముందుగా పులిహోర, తరవాత దద్దోజనం వడ్డించారు.

"కడుపు నిండా తినండర్రా, అమ్మాయిలూ, సిగ్గు పడద్దు." మధ్య మధ్య హుషారు చేస్తూ పంక్తుల మధ్య తిరుగుతోంది హేమలత.

తారాదేవి చకచకా వడ్డిస్తోంది. వడ్డన చేస్తూ శ్యామల విస్తరి దగ్గరికి వచ్చినప్పుడల్లా అందులో మరి కొన్ని వెయ్యడం ద్వారా ఆ పిల్ల పట్ల తనకున్న ప్రత్యేక అభిమానాన్ని వ్యక్త పరుస్తోంది.

పిల్ల లంతా తృప్తిగా తిని లేచారు. తరవాత హేమ, తార, హోమ్ నించి వచ్చిన వ్యాన్లకూడా తినటం ముగించారు.

గుడి చుట్టుపట్ల చిన్నవీ, పెద్దవీ ఎన్నో కొండ గుట్ట లున్నాయి. స్వేచ్ఛగా ఆడుకోమని అమ్మగారు సెలవివ్వడంతో పిల్లలకి ఎనలేని ఆనందం కలిగింది. ఎంతో సేపు కొండలమీద, తిప్పలమీద ఉరుకులు, పరుగులు పెడుతూ ఆడుకున్నారు. ఒకరి నొకరు కవ్వించి పట్టుకుంటూ, తగని అల్లరి చేస్తూ పొద్దువాలే వరకు గడిపారు.

సాయంత్రం నాలు గయింది.

సూపర్నెంటుగారి పిలుపు వినగానే ఠకీమని ఆటల నాపేసి, అందరూ బస్సు దగ్గరి కొచ్చేశారు. పిల్లలతోపాటు తారాదేవికూడా బస్సులో ఎక్కి శ్యామల చేతిని తన చేతిలోకి తీసుకుని ప్రేమగా నిమురుతూ, ఆ పిల్లతో ఏవేవో మాట్లాడుతోంది

అరగంటలో తారాదేవి ఊరు వచ్చేసింది. "హేమా! మరింక నే నుంటాను. వచ్చే క్రిస్మస్ హాలిడేస్‌లో శ్యామల్ని మా ఇంటికి పంపు. పాపం! శెలవుల్లో వెళ్ళి ఉండి రావడానికి దాని కెవరున్నారు కాబట్టి! తప్పకుండా పంపు, హేమా!" బస్సు దిగుతూ అర్థింపుగా అంది తార.

"అలాగే, తారా, ముందు నీకు థాంక్సు చెప్పనివ్వు. ప్రేమతో నన్ను కలుసుకోడానికి వచ్చావు. హుషారుగా పిల్లలతో ఎన్నో ఆట లాడించావు. ఓపిగ్గా అందరికీ వడ్డించావుకూడా. చాలా చాలా థాంక్సు, తారా! మరి వెళ్ళొస్తాం. అన్నట్లు. ఒకసారి హోమ్‌కి రాకూడదూ! రెండు రోజులుండేట్టుగా వచ్చావంటే కరువు దీరా కబుర్లు చెప్పుకో వచ్చు మనం."

తార క్షణంపాటు ఆలోచించింది. "అలాగే, హేమా తప్పకుండా వస్తాను- క్రిస్మస్ శెలవు లిచ్చే ముందుగా. అలా అయితే శ్యామల్ని కూడా నాతో తీసుకొచ్చెయ్య వచ్చు."

సూపర్నెంటుగారితో పిల్ల లందరూ ధన్యవాదాలు, టాటాలు చెప్పారు.

బస్సు దిగి, నెమ్మదిగా నడచి వెళ్ళిపోతున్న తారాదేవిని ఏదో అద్భుత వస్తువును చూస్తున్నట్లు కంటికి కనుపించేంత వరకూ కిటికీలోంచి చూస్తూ ఉండిపోయింది శ్యామల. శెలవుల్లో తనని పంపమని ఎంతో అభిమానంతో అడిగింది తారాదేవి! నిజంగా ఆమె దేవతే గాని, మనిషి గాదు!

## (2)

తారాదేవి, హేమలతల స్నేహం బాల్యం నుంచీ కొనసాగుతూ వస్తోంది. ఎలిమెంటరీ తరగతులనించీ కళాశాల విద్య వరకూ కలిసి చదువుకున్నారు. చదువుల తరవాత కూడా ఒకే డిపార్టుమెంటులో ఉద్యోగా లయినాయి. మహిళా సంక్షేమశాఖలో-హేమలత 'బాలసదనము' సూపరింటెండెంటుగానూ, తార స్త్రీ సంక్షేమ విస్తరణాధికారిగానూ పని చెయ్యడం ప్రారంభించారు. తార పని చేస్తున్న పంచాయతీ సమితి హేమలత పని చేస్తున్న హోమ్‌కి కేవలం ముప్ఫయి కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అందుచేత తరచూ ఒకర్నొకరు కలుసుకుంటూ, స్నేహాన్ని పెంపొంగించుకుంటూ వస్తున్నారు.

విధి నిర్వహణలో హేమలత నిజాయితీగా, జాగ్రత్తగా ఉంటుందని పేరు. తన మేనేజిమెంటు కిందున్న బాలసదనాన్ని వీలయినంత క్రమబద్ధంగా నడపాలనే పట్టుదల ఉన్న మనిషి. పిల్లల నోళ్ళు గొట్టి సంపాదించాలనే ఆలోచన ఏ కోశానా లేని వ్యక్తి. డ్యూటీ మైండెడ్ ఆఫీసర్‌గా, నిజాయితీ గల సూపర్నెంటుగా డిపార్టుమెంటులో మంచి పేరుం దామెకి.

పంచాయతీ సమితి సర్వీసులో ఉన్న తారాదేవికి గ్రామీణ స్త్రీల అభివృద్ధి, వికాసాల కోసం పని చేయవలసిన బాధ్యత ఎంతో ఉంది. గ్రామ గ్రామాన, వీలయిన ప్రతి చోటా మహిళా సంఘాలు, తదితర స్వచ్ఛంద సేవాసంస్థలు స్థాపించి వాటి ద్వారా రకరకాల స్త్రీ సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తూ పోవాలి. స్త్రీ జాతి వికాసానికి అడ్డు పడే మూఢ విశ్వాసాల్నుంచీ, బూజు సంప్రదాయాల్నుంచీ స్త్రీలని విముక్తుల్ని చేసి, వారిలో శాస్త్రీయ దృష్టిని పెంచి, వారి ఆలోచనా పరిధిని విస్తృతపరిచే కార్యక్రమాలెన్నింటినో రూపొందించి, జయ ప్రదంగా అమలు పర్చవలసిన గురుతర బాధ్యత ఉన్నటువంటిది తారాదేవి ఉద్యోగం.

సమర్థులయిన కొద్దిమంది ముఖ్య సేవికల్లో తారాదేవి అగ్రగణ్యురా లనిపించుకుంటూ వస్తున్నది. గ్రామాలన్నీ ఓపిగ్గా కలియ తిరుగుతుంది. ఆయా వర్గాల స్త్రీలకి అనువుగా ఉండే కార్యక్రమాల్ని అమలు పరచడంలో మంచి చొరవ చూపుతుంది. కార్యదక్షత, మాటకారితనం పుష్కలంగా ఉన్నాయి. మహిళా సంఘాల నాయకురాళ్ళ నించీ సామాన్య సభ్యురాండ్ర వరకూ అవసరమయినప్పుడు గదమాయించి పనులు చేయించగల శక్తి బాగా ఉన్న మనిషి తారాదేవి.

## (3)

స్కూళ్ళకి క్రిస్మస్ సెలవు లిచ్చారు.

అనుకున్న ప్రకారం తారాదేవి బాలసదనానికి పయనమై వెళ్ళింది. హేమలతతో ఓ రోజంతా హాయిగా కబుర్లతో, నవ్వులతో గడిపింది. మరునటి రోజు సాయంత్రానికి శ్యామల్ని వెంట బెట్టుకుని ఇంటి కొచ్చింది.

శ్యామలకి ఊహ తెలిశాక బాలసదనం దాటి బయట ఊరికి ఎప్పుడూ వెళ్ళడం జరగలేదు. అందుచేత పదిహేను రోజులపాటు బాలసదనాన్ని వదిలి మరో చోట ఉండబోతున్నాననే తలంపు, అందునా తారమ్మగారింట్లో గడపబోతున్నా ననే భావన శ్యామలలో గొప్ప థ్రిల్‌ని కలిగిస్తోంది.

తారాదేవి ఇల్లు ఎంతో నచ్చింది శ్యామలకి. ఇంట్లో ప్రతి గదిలోనూ అమర్చి ఉంచిన ఫర్నిచరు, ఇంటి చుట్టూ ఉన్న పూలతోట ఎంతో అందంగా, అద్భుతంగా ఉన్నా యా పిల్లకి.

డ్రాయింగు రూములో సోఫా సెట్టు- దానికి తొడిగి ఉన్న అందమయిన ఎంబ్రాయిడరీ లతల కవర్లు, సన్ గ్లాసు అమర్చిన టీపాయ్ గది మధ్యగా నిగనిగ లాడుతూ ఉంది. ఆహ్లాదకరమైన లేత రంగుల్లో ప్రకృతి దృశ్యాల పటాలు, కేలండర్లు హుందాగా వేలాడుతున్నాయి.

బెడ్ రూమ్ మరీ అందంగా ఉంది. డబుల్ కాట్ మీది డన్‌లప్ పరుపుల మీద తెల్లని దుప్పట్లు పరిచి ఉన్నాయి. తల వైపున తెల్లని గలీబులతో మెత్తని దిండ్లు, కాళ్ళ వెంపున అంత తెల్లగానూ ఉన్న బాలీసులు.

గది గదికీ వేసి ఉంచిన డోరు కర్టెన్లు, విండో కర్టెన్లు ముచ్చటయిన రంగు రంగుల డిజైన్లతో శ్యామల దృష్టిని చెదరగొడుతున్నాయి.

తారాదేవి ఇంట్లో ఉన్న ప్రతి వస్తువూ ఆమె గొప్పతనాన్నీ, అంతస్తునీ చాటి చెబుతున్నాయి.

తారాదేవిగా రింటి భోజనం కూడా చాలా గొప్పగా అనిపిస్తోంది శ్యామలకి.

తార మంచి భోజన ప్రియురాలు. ఇంట్లో నికరంగా ఉండేది తనూ, తన ఏకైక కుమారుడు మాత్రమే. అయితే నేం?పూట పూటకీ నాలుగు రకాల కూర లుండి తీరాలి. రోజూ రెండు పూటలా టిఫిన్లు ఉండాలి.

తారాదేవి వ్యాను వీరయ్యకి వంట బాగా వచ్చు. రుచిగా రకరకాల వంటలు, పిండి వంటలు చేసి, వడ్డించడం మహా సరదా అతనికి. ఇంటి పట్టునే ఉండి, అమ్మగారికి వంట చేసి పెట్టడంలో ఉన్న సుఖం, ఆమెతో కలిసి ఊళ్ళన్నీ తిరిగి రావడంలో లేదనే సంగతిని ఎప్పుడో గ్రహించాడు వీరయ్య. ఈ ఏర్పాటు తారాదేవి క్కూడ బాగా నచ్చింది.

పసితనం నించీ హోమ్ తిండినే ఎరిగి ఉంది శ్యామల. లోకంలో ఇన్ని రుచులూ, ఇన్ని పదార్థాలు ఉంటాయనే సంగతి తారమ్మగారింటి కొచ్చాకనే తెలుస్తోం దా పిల్లకి. ప్రతి భోజనం ఒక విందులాగే ఉంటున్నది, ప్రతి రోజూ ఒక పండగ లాగా గడుస్తున్నది.

వండిన పదార్థాల రుచి ఒక ఎత్తు; తారాదేవి వాటిని వడ్డించే తీరు మరో ఎత్తు. వడ్డించేటప్పుడు తారాదేవి కనబరిచే ఆప్యాయతతోనే శ్యామలకి కడుపు నిండిపోతోంది.

తన పాతబడ్డ నైలెక్సు చీరల్నీ, అమెరికన్ జార్జెట్ చీరల్నీ లంగాలు, ఓణీలుగా మలిచి, పాత జాకెట్లని సైజు చేసి శ్యామలకి తొడగ బెట్టింది తార.

యౌవనారంభ దశలో ఉంది శ్యామల. పసిమి ఛాయతో మిసమిస లాడుతున్న శ్యామల ఒంటికి అవి మరింత శోభను కలిగించాయి. పాతవయినప్పటికీ, మృదువుగా, అందమైన రంగులలో ఉన్న ఈ దుస్తుల్లో శ్యామల మెరిసిపోతున్నది.

ఎవరూ చూడకుండా, బీరువా అద్దం ముందు నిలబడి తన అందం చూచుకుంది శ్యామల. తన ఆకారం పూర్తిగా మారిపోయింది. కళకళ లాడిపోతోంది తన రూపం. అద్దంలో పదే పదే చూచుకుంటూ 'నేనూ చాలా అందమయిన దాన్నే' అని జీవితంలో మొదటిసారిగా అనుకుంది శ్యామల.

శ్యామ లొచ్చి పది రోజు లయింది. మరో ఐదు రోజులకి శెలవులు పూర్తవుతాయి.

మళ్ళీ బాలసదనంలో కెళ్ళి పడాలి కాబోలు! మళ్ళీ రోజూ స్కూలు, పాఠాలు, హోమ్‌వర్కు.. హోమ్‌లో జీవితం కట్టుదిట్టాల మయం. తెల్లవారుఝామునే నాలుగింటికి గంటమోగగానే నిద్ర లేవాలి. అంత పొద్దుటే లేవడం తన కిష్టముండదు. మరో గంట నిద్ర పోదా మనిపిస్తుంది. కానీ పడుకుని ఉండిపోతే ఎవరు ఊరుకుంటారు? మాట్రిన్ అక్క వచ్చి జుట్టు పట్టుకు లేపుతుంది. సగం నిద్ర పోతూ, ఆవులిస్తూ పిల్లలంతా ప్రార్థన హాల్లోకి పరిగెడతారు. పాచి ముఖాలతో, జోగుతూ ప్రార్థన గీతాలు పాడి, ధ్యానం చేస్తారు.

ఆ తరవాత మరింత హడావుడి మొదలవుతుంది. కాలకృత్యాలు, స్నానాలు, తిండి తినడాలు...అన్నీ హడావుడిగానే పూర్తవుతాయి.


తారమ్మగా రింట్లో తనకి లభించిన స్వేచ్ఛ, సంతోషం, ఆదరణ ఆ హోమ్‌లో మచ్చుకయినా దొరకవు.

అయితే, తన కారేళ్ళప్పటి నించీ ఈనాటి వరకూ కడుపులో బెట్టుకు కాపాడుతున్నది బాలసదనమే. తన మంచీ చెడూ, చదువూ సంధ్యా అన్నీ అక్కడి అధికారులే చూచుకుంటున్నారు. తారమ్మగా రింటికి తను చుట్టపు చూపుగా మాత్రమే వచ్చింది. ఆమె దయవల్ల, మంచితనంవల్ల శలవు లన్నీ ఆనందంగా గడిపింది. ఇంత మాత్రం చాలదా తనకి? తిరిగి సదనాని కెళ్ళాక శ్రద్ధగా, పట్టుదలగా చదువుకోవాలి. ప్రతి క్లాసూ పాసయిపోతూ కాలేజి చదువుకూడా ముగించి, తారమ్మగారిలా పెద్ద ఉద్యోగస్థురా లవ్వాలి తను. ఆమెకిలాగే మంచి ఇంట్లో ఖరీదయిన సామాన్లు, బట్టలు కొనుక్కుంటూ హాయిగా బతకాలి.

"అమ్మా శ్యామలా!" డ్రాయింగు రూమ్‌లో పేపరు చూస్తున్న తార పిలిచింది.

ఆలోచనల్లో మునిగి తేలుతూ తోటలో పూలమొక్కల నడుమ తిరుగాడుతున్న శ్యామల ఉలిక్కిపడి, "వస్తున్నా నమ్మగారు" అంటూ గబగబా పరిగెట్టి వచ్చి, "పిలిచారా, అమ్మా" అంది.






"ఔనమ్మా! ఇలా రా...శేలా వచ్చి నా పక్కగా కూర్చో." తారాదేవి చేతితో చూపించగా, సోఫాలో ఆమెకి ఎడమ వక్కగా ఒదిగి కూర్చుంది శ్యామల.

"ఏమ్మా! నీ శెలవు లవ్వుడే అయిపోవస్తున్నట్టుంది గదూ! ఇంక నాలుగు రోజులకి తిరిగి హోమ్కెడతావు కాబోలు. ఎలా ఉంది అక్కడ నీ చదువు? ఎనిమిదో క్లా సేనా నీవు చదువుతున్నది?"

"ఔనం డమ్మగారూ!"

"మరి కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకుంటున్నావా? అన్ని సబ్జక్టులు అర్థమవుతున్నాయా?"

"ఆ...ఆ...అన్నీ బాగానే అర్థమవుతున్నాయి కాని..." నీళ్ళు నములుతూ చెప్పడం ఆపింది శామల.

"కానీ అంటున్నావు అంటే ఏదో సబ్జక్టు నీ కర్థమవడం లే దన్నమాట. అంతే కదూ?"

"ఔనమ్మగారూ! లెక్కలు అర్థమవడం లేదండమ్మా! ఎంత ప్రయత్నించినా అర్థమవడం లేదవి. మంత్లీ టెస్టుల్లో, క్వార్టర్లీ పరీక్షల్లో అన్నిట్లోనూ మంచి మార్కులు తెచ్చుకున్నాను. లెక్కల్లో మాత్రం ఫెయిలు మార్కులే వచ్చాయి."

"అరెరె...! మరి సూపర్నెంటమ్మగారితో చెప్పావా ఆ సంగతి? స్టడీ అవర్సులో ఆమె మీకు పాఠాలు చెబుతూ ఉంటారుగాబోలు గదా! మరి ఆమె దగ్గర అర్థంకాని లెక్కలన్నీ చక్కగా నేర్చుకో వచ్చు గదా!"

"అమ్మగారికి తెలుసండీ! చాలాసార్లు చెప్పాను. అయితే, అమ్మగారికి ఆఫీసు పనితోనే సరిపోతుందండి. ట్యూషను చెప్పడాని కసలు టైమెక్కడిదండీ!"

"మరి నీకు లెక్క లర్థమయ్యే దెట్లా?"

ఇంకా ఏం చెప్పాలో తోచక మౌనంగా ఉండిపోయింది శ్యామల.

"సరే. ఒక పని చే సి చూడు. మీ క్లాసులో బాగా లెక్కలు వచ్చిన అమ్మాయిలతో కొంచెం స్నేహంగా ఉండు. వాళ్ళ నడిగి ముందు సూత్రాలను బాగా అర్థం చేసుకో. తరవాత టెక్స్టుబుక్కులో ఆయా సూత్రాలకి సంబంధించిన అభ్యాసాలని ప్రతి రోజూ విడవకుండా చెయ్యి. తప్పు ఆన్సరొస్తే, ఆ అమ్మాయి ల్నడిగి సరిద్దికుంటూ ఉండు. అయినా, ఈ క్లాసు ఎలాగో ఒకలా లాగించు. వేసవి సెలవులకి మళ్ళీ నువ్వొచ్చినప్పుడు నే నే చెబుతాను లెక్కలు. ఎలా రావో చూస్తా నప్పుడు."

శ్యామల కళ్ళు ఆశ్చర్యంగా విప్పారాయి. గుండె గంతు లేస్తోంది.

"ఏమిటి, శ్యామలా, ఏమీ మాట్లాడకుండా అలాగే చూస్తున్నావేమిటి? శెలవులకి మళ్ళీ ఇక్కడికి రావడం ఇష్టం లేదా నీకు?"

తారాదేవి ప్రశ్నతో శ్యామల స్పృహలోకి వచ్చి, తడబడుతూ అంది-"ఇష్టమేనా అని అడుగుతున్నారా, అమ్మా! అసలు మిమ్మ ల్నిప్పుడు విడిచి వెళ్ళిపోవడానికి నా కిష్ట మవుతున్నదా? వేసవి శెలవులకి మళ్ళీ మీ దగ్గరికి రావడమంటే ఎంత బాగుంటుందమ్మా నాకు! తప్పకుండా వస్తానమ్మా!" దుఃఖంతో జీరబోయిన గొంతుతో, నిండు కొచ్చిన కన్నీళ్ళతో అంది శ్యామల.

తారాదేవి శ్యామల భుజాన్ని చేత్తో చుట్టి ప్రేమగా దగ్గరికి తీసుకుని తల నిమిరింది. "ఏం ఫరవాలేదు. దిగులు పడబోకు. నీ కిష్టమయినట్టుగానే నువ్వు నా దగ్గరే ఉండి చదువుకో వచ్చు కాని, ఈ సంవత్సరం ఆఖరున పరీక్షలయ్యే వరకూ హోమ్లో ఉండాలి మరి. వేసవి శెలవులకి నువ్వొచ్చిన తరవాత ఇహ మళ్ళీ హోమ్ కెళ్ళాల్సిన పని ఉండదులే. మాతోనే ఉంటూ, ఇక్కడి హైస్కూల్లోనే చేరి చదువుకుందువు గాని."

శ్యామల తన చెవుల్ని నమ్మలేక పోతున్నది. మితి మీరిన ఆనందంతో, ఉద్వేగంతో గుండె వేగంగా కొట్టుకోనాగింది.

దిగులుతో, భయపడుతూ హోమ్కి తిరిగి వెళ్ళిపోయేందుకు సిద్ధమవుతున్న శ్యామల హృదయంలో తారాదేవి పలుకులు అమృతపు జల్లుల్ని చిలికాయి.

## (4)

ఒక పెద్ద భూస్వామి తారాదేవిని చేరదీశాడు. లాండ్ సీలింగ్ చట్టం అత ణ్ణేమీ కదల్చలేకపోయింది. పొలాల అజమాయిషీకి ఒక స్కూటరూ, పట్టణాలకి పోయి రావడానికొక కారూ మెయిన్టైన్ చేస్తా డతడు.

వ్యవసాయం చేయించడంలో లగువు బిగువులన్నీ బాగా తెలు సతనికి. పాలేళ్ళతో, కూలి వాళ్ళతో హాస్యా లాడుతూ,నవ్వుల్లో ముంచుతూ దగ్గరుండి పని చేయిస్తాడు. దొరగారి తమాషా కబుర్లలో పడి, కొండంత పని నయినా గోరంతగా భావించి క్షణాల మీద లాగించేస్తారు పనివాళ్ళు.

ఊళ్ళో వాళ్ళందరికీ అతడు పాపిరెడ్డి దొర; చుట్టు పట్ల ఊళ్ళో వాళ్ళకి అతను చెప్పుకో దగ్గ ఓ పెద్ద కామందు.

పాపిరెడ్డి ఎంతో మనసు పడి, చేరదీ సిన మగువ తారాదేవి.

ఆమె పని చేస్తున్న సమితి హెడ్క్వార్టర్సుకి ఓ పది మైళ్ళ దూరంలోనే పాపిరెడ్డి సొంత ఊరుంది. పట్టమహిషీ, ముగ్గురు కొడుకులూ, కూతురూ ఊళ్ళో ఉన్న లంకంత బంగళాలో ఉంటారు.

రెడ్డి మాత్రం ఎక్కువగా తారతోనే ఉంటాడు. ఆమెకి గవర్నమెంట్ వాళ్ళిచ్చిన చిన్న క్వార్టర్సులోనే స్వర్గం కనపడుతూ ఉంటుం దతనికి.

తారకీ, పాపిరెడ్డికీ ఎందులోనూ పొంతన లేదు. స్కూలు ఫైనలు ఫెయి లవడంతోనే రెడ్డి చదువు ముగి సింది. తార బి.ఎ. పాసయింది. అతనికి నలభై ఏళ్ళు నిండుతున్న తరుణంలో ఇరవైకూడా నిండని తారని చేజిక్కించుకో గలిగాడు. అరవయ్యోవడిలో వడ్డా డిప్పుడు రెడ్డి. ఒరిజినల్గా ఉన్న కురూపితనం వయసుతోపాటు పెరుగుతూ వస్తున్నా, తన కున్న ఎకరాల ఎర చూపెడుతూ ఇప్పటికీ వయసు చేప పిల్లల్ని పట్టి.వేస్తుంటాడు.

తారకూడా లోకం తెలియనిదేం కాదు. పాపిరెడ్డి తనకు తగ్గ జోడు కాడని తెలుసు. అయితే మాత్రమేం? తనంటే పడి ఛస్తాడు. ఏది కావాలని అడిగినా నిమిషంలో తెచ్చి పడేస్తాడు. తన నోటికి, ధాటికి లొంగి పడి ఉంటాడు. ఇతనిలాంటి బంగారు పట్టుగొమ్మ అందరికీ దొరకడం కష్టం. తను గడిపే హైక్లాసు బతుకు, ఒంటినిండా అమరిన నగలు ఒక తన జీతపు రాళ్ళతోనే సాధ్య మవ్వవని ఆమెకి తెలుసు. దేనికీ కొరత లేకుండా హాయిగా దర్జాగా గడిచిపోవాలి తన బతుకు. మరో విధంగా తను బతకలేదు.

పాపిరెడ్డి వల్ల తారకి ఒకే ఒక కొడుకు కలిగాడు. వా డప్పుడే పధ్నాలుగేళ్ళ వా డయినాడు.

రెడ్డికి వ్యవసాయమే గాక, అనేక చిన్నా-పెద్ద పరిశ్రమలుకూడా ఉన్నాయి. వాటిని జాగ్రత్తగా నడుపుకుంటూ మంచి లాభాలు తీస్తుండడంలోనే అతని కాల మెక్కువగా గడిచిపోతున్నది. ఇదివరకులా రోజుల తరబడి తార ఇంట్లో గడప లేకపోతున్నాడు. ప్రతి శనివారం రాత్రి తార ఇంటికి చేరుకుంటాడు. ఆదివారం ఆమెతో గడిపి, సోమవారం ఉదయాన్నే వెళ్ళిపోతాడు-రకరకాల వ్యవహారాలనీ, పనులనీ చూచుకోవడానికి.

ఆదివారం వచ్చిందంటే తార ఇంట్లో చాలా మజాగా ఉంటుంది. కోడి కుర్మా, బిరియానీ వాసనలతో ఇల్లంతా ఘుమఘుమ లాడిపోతుంది.

రెడ్డికి పేకాట పిచ్చి ఎక్కువే. ఆదివారం అవడంతో సమితి ఆఫీసుకు చెందిన ఛోటా ఆఫీసర్లు రెడితో పేకాడ్డానికి సిద్ధంగా ఉంటారు. పగలంతా సమితి ఆఫీసులోనే ఆట బహు జోరుగా సాగుతుంది. రాత్రికి తార, ఆమెతోబాటు మందు సీసాలు రెడీ! ప్రతి ఆదివారపు రాత్రి ఇలాగే ఖుషీ ఖుషీగా, హాయి హాయిగా గడిచిపోతుంది పాపిరెడ్డికి.

తారకి రెడ్డివల్ల బాగానే గిట్టుబా టయింది.పది ఎకరాల సుక్షేత్రమంటి మాగాణి ఆమె పేర రిజిస్టర్ చేశాడు రెడ్డి.

తారకి దేనికీ లోటు లేదు. ఎందులోనూ కొరత

లేదు. అయినప్పటికీ ఎందుకనో ఏదో పోగొట్టుకున్న దానిలా ఎప్పుడూ శూన్యంలోకి చూస్తూ ఉంటుంది. నిజానికి రెడ్డితో జత కలిసిన కొద్ది కాలానికే ఆమెకి మబ్బు విడిపోయి నట్టయింది. ఇదీ అని చెప్పుకోలేని ఏదో అశాంతి ఆమెలో చోటు చేసుకుంది. జీవితంలో ఇంకేమి కావాలో, అసలు తను ఏం పోగొట్టుకున్నదో తెలియని అయోమయ స్థితి; తీరని వెలితి!

మనసులో ఏర్పడి, రోజు రోజుకూ విస్తరిస్తున్న శూన్యాన్ని భర్తీ చేసుకుందుకు తార రకరకాల ప్రయత్నాలు చేస్తోటుంది.

ఒంటినిండా రాళ్ళ నగలు, వారాల నగలు, నగల సెట్టులు!

కంటికి నచ్చిన చీరలు- నేతవి, సింథటిక్‌వి, పట్టువి-ఖరీదు ఎంతయినా ఫర్వాలేదు.

ఇంటినిండా ఫర్నిచరు, స్టీలు సామాను, ఫ్రిజ్, గ్రైండరు, రికార్డు ప్లేయరు మొదలయిన అన్ని ఆధునిక గృహోపకరణాలు. ఎన్ని సమకూర్చుకున్నా, ఇంకా ఏమిటో కావాలని తపన. సమయమూ సందర్భమూ లేకపోయినప్పటికీ పటాటోపంగా అలంకరించుకుని, పట్టు చీరలు కట్టుకుని తిరుగుతుంది తార. ఎప్పుడు బుద్ధి పుడితే అప్పుడు పలావులు, బిరియానీలు, కోడి వేపుళ్ళు తయారు చేయించుకుంటుంది. ఒళ్ళు పెరిగిపోతున్న దనే ధ్యాసయినా లేకుండా ఆవురావురుమంటూ తింటుంది.

అయినా, తృప్తి కలగదు తారకి.


తార ఖర్చులు సహజంగానే చాలా భారీగా ఉంటాయి. వాటిని తట్టుకునేందుకు ఏవేవో సంపాదనా మార్గాలను నేర్పుగా వెదుకుతూ ఉంటుంది.

సంపాదించాలి; బాగా పోగు చేయాలి! ఈ మాదిరి ఆరాటం పట్టుకున్న మనిషికి అందుకవసరమయిన మార్గాలు కనబడకుండా ఉండే ప్రశ్నే లేదు. తారకి మంచి సెదోడు పాపిరెడ్డి. ఇలాంటి వ్యవహారాల్లో నిజమైన సహచరుడు. ఏయే మార్గాల్లో డబ్బు సంపాదించ వచ్చునో క్షుణ్ణంగా తెలిసిన రెడ్డి-దానికి పిల్లల్ని పెట్టించడం కూడా ఎలాగో తెలిసిన పెద్దమనిషి. రెడ్డి సాంగత్యంలో తార ఆ యా వ్యవహార మతలబు లన్నీ చక్కగా తెలుసుకుంది.

వాటిలో మచ్చుకు ఒకటి-స్కూటర్లు కొని, వెంటనే అమ్మి వేసే బిజినెస్ నే తీసుకుంటే-

స్కూటర్ ఏజన్సీలకి రిలీజయ్యే ప్రతి కోటాలోను తార పేరు మీదనో, మరో బంధువు పేరుమీదనో దఫాకి రెండు స్కూటర్ల చొప్పున ఇండెంటు పెడతాడు రెడ్డి. కోటా రిలీజయినట్టు కబురందగానే తారాసమేతుడై హైదరాబాదు పరుగెత్తుతాడు. రెండు స్కూటర్లకీ చెల్లించవలసిన బకాయిలన్నీ చెల్లించేసి, వెంటనే అక్కడి కక్కడే శాల్తీకి రెండు మూడు వేల లాభం చూచుకుని అవసరమున్నవాళ్ళకి అమ్మివేస్తాడు. ప్రతి ఆరు నెలలకీ ఇలాంటి అమ్మకాలు జరుగుతూ ఉంటాయి. వచ్చిన లాభాలు తార బాంకు అకౌంటులో జమ అవుతూ ఉంటాయి.

దాదాపు అన్ని రకాల బాంకుల్లోను రెడ్డి, తారల పేర జాయింటు అకౌంట్లు ఉన్నాయి. బాంకు బాలెన్సు లకారాల మీదికి చేరింది. డబ్బు జమ అవుతున్న కొద్దీ సంపాదన మీద ధ్యాస ఇంకా ఇంకా ఎక్కువయిపోతున్నది ఇద్దరికీ.




సన్నకారు రైతులకీ, చిన్న పరిశ్రమదారులకూ గవర్నమెంటు ఇస్తున్న ఏ బాపతు ఋణాన్నికూడా రెడ్డి వదలి పెట్టడు. తత్సంబంధమైన ఆఫీసర్లని సులువుగా లోబర్చుకోగల రెడ్డికి రకరకాల లోన్లు క్షణాలమీద చేతిలో వచ్చి పడతాయి. అలా వచ్చిన లోను డబ్బుల్ని తారాదేవి ఐదు పర్సెంటు వడ్డీకి, అవతలి వాళ్ళ అవసరాన్ని బట్టి పది పర్సెంటు వడ్డీకి తిప్పుతూ సాటి మానవుల ఇబ్బందుల్లో ఆదుకుంటూ ఉంటుంది.

ఈ విధమైన డబ్బు వెంపర్లాటలోనే శేషగిరి ఆమెకి తగిలాడు. వాళ్ళిద్దరి మధ్య స్నేహం అతి త్వరగా పెరిగిపోయింది. స్వజాతి పక్షులు ఒక చోటికి చేరినట్లు ఆ ఇద్దరి కలయిక సహజంగా జరిగిపోయింది.

తార, శేషగిరి ఒకే సమితి ఆఫీసులో పని చేస్తున్నారు. సమితి ఆఫీసులో మేనేజరుగా అతను తార కన్న మంచి హోదాలో ఉన్నాడని చెప్పొచ్చు. మేనేజరు హోదాలో అత నిప్పటి వరకూ జిల్లాలో ఎన్నో సమితులు చూచి వచ్చాడు. ఏ సమితిలోనూ ఎక్కువ కాలం ఉండనిచ్చారు కాదు అధికారు లతణ్ణి. టవున్లో సొంత ఇల్లు, కొంత భూవసతి ఉన్నాయి. కుటుంబాన్ని తనతోపాటు ఊరూరా తిప్పడం, పిల్లల చదువులకు ఇబ్బంది కలిగించడం ఇష్టం లే దతనికి.అందుచేత ఒంటరిగానే కాలం గడుపుకుంటూ వస్తున్నాడు.

సమితి ఆఫీసుల్లో మేనేజరు పోస్టుకీ, ఇతర డిపార్టుమెంటు ఆఫీసుల మేనేజరు పోస్టులకు సహస్ర భేదం ఉంది. పంచాయితీ సమితి మేనేజరు హోదాకు మరేదీ సాటి రాదు.

సమితి మేనేజరు ఒక కంట్రోలు కేంద్రం వంటివాడు. అటు బి.డి.ఒ.ని, ఇటు కింది సిబ్బందిని అద్భుతంగా కంట్రోలు చెయ్యగలిగే టెక్నిక్కు అతని చేతిలో ఉంటుంది. అతను తలుచుకుంటే అందరినీ ముప్పతిప్పలు పెట్టగలడు. అతని అండదండలు లేనిపక్షంలో ఎంతలావు బి.డి.ఒ. అయినా చప్పగా నీళ్ళు గారి పోవలసిందే. అందుకనే మేనేజరు పోస్టు చాలా కీ పోస్టు అనేది అందరూ అంగీకరించే నిజం.

శేషగిరి మంచి వ్యవహార దక్షుడు. అకౌంట్స్ మేటర్సులో మంచి నైపుణ్యం ఉంది. ఎంతమందో బి.డి.ఒ.లకు అర్థశాస్త్రంలో పాఠాలు నేర్పాడు.

పంచాయతీ సమితుల ద్వారా ప్రభుత్వం ప్రతి ఏడూ సన్నకారు, చిన్నకారు రైతుల కోసం లక్షలకొద్దీ నిధులు ఋణాల రూపంలో మంజూరు చేస్తూ ఉంటుంది. ఈ ఋణాల నందుకున్న రైతులు ఆధునిక వ్యవసాయ పరికరాల్ని, మంచి రసాయనిక ఎరువుల్ని, మేలుజాతి విత్తనాల్ని కొనుగోలు చేసి పంటలు ఇబ్బడి ముబ్బడిగా పండించాలని ప్రభుత్వం ఆశిస్తుంది.


ఏటేటా మంజూరయే లక్షలాది నిధులు నిజమైన బక్క రైతులకే అందుతున్నాయో, లేదో పట్టించుకునే ఓపిక మాత్రం అటు ప్రభుత్వానికీ ఉండదు; ఇటు ప్రజలకీ ఉండదు.

ప్రభుత్వ నిధుల్ని అర్హులయిన వారికే అందించాలని తాపత్రయపడే ఆఫీసర్లకు పుట్టగతు లుండవు. ప్రత్యేకించి సమితుల పరిపాలనలో ఏ ఆఫీసరుకూడా తనొక్కడికీ ఆశ లేనంత మాత్రాన తతిమ్మా వాళ్ళకి ఆశ లుండవని అనుకోవడం ప్రమాదకరం. నీతి కోసం పాకులాడే ఆఫీసరు-అతడు విస్తరణాధికారి కావచ్చు, సాక్షాత్తు బి.డి.ఒ.యే కావచ్చు- తోటి సిబ్బందిని సంతృప్తి పడనివ్వకపోతే వ్యవహారం తీవ్రంగా బెడిసిపోతుంది. మిగిలిన వాళ్ళంతా ఏకమై ఈ నిజాయితీ పిచ్చివాడి పనిబడతారు. అసలు ఆ మానవుడే దారుణమైన అవినీతి పరుడని ప్రచారం చేస్తారు. పైకి రిపోర్టులు పంపుతారు.ఫలితం! సస్పెండయినా కావచ్చు; శంకరగిరి మాన్యాలు పట్టడమయినా కావచ్చు.

అయితే, హానెస్టీని కాపాడుకోవడం కోసం అగచాట్లెన్నయినా పడేవాళ్ళు లేకపోలేదు. కాని వాళ్ళకి గుర్తింపేది? పై అధికార్ల దృష్టిలో అలాంటి ఆఫీసరు వట్టి 'ఉపయోగం లేని వాజమ్మలు'.

అసలు దేశాన్ని, జనాన్ని ఉద్ధరించడానికే పుట్టామని చెప్పుకునే పెద్ద లందరూ-దేశ సంపదను, ప్రజా ధనాన్ని రెరెండు చేతులా జుర్రు కోవడానికే పోటాపోటీలు పడుతుండగా ఉద్యోగులు మాత్రం హానెస్టీ మడి గట్టుకుని మూల కూర్చుందామని ఎందు కనుకుంటారు?

ఇతర ఆఫీసుల మాటెలా ఉన్నా, సమితి ఆఫీసుల్లోని కొంతమంది బుద్ధిమంతులు పబ్లిక్కును పిండుకు తినడంతోనే సంతృప్తి పడ్డం లేదు. సాటి ఉద్యోగుల టి.ఎ. బిల్లులు, సరెండరు లీవు జీతాలు, రకరకాల ఎరియర్సు బిల్లుల్ని చూస్తే వీళ్ళకి పండగ! అందులోంచి పది శాతం వరకూ చిలక్కొట్టుడు కొట్టిగాని బిల్లులు పాసు చెయ్యరు.



ఈ బాపతు సంప్రదాయాల్ని, సదాచారాలని ప్రవేశపెట్టి పంచాయతీ సమితుల పాలనా సంస్కృతికి మెరుగులు దిద్దిన ఘనుల్లో శేషగిరి ఒకడు.

తనకి శేషగిరి స్నేహం లభించడం ఒక వరంలా తలుస్తోంది తార. నిజానికి అనేక వ్యవహారాల్లో ఆమె కతడు గొప్ప మార్గదర్శకుడుగా, శ్రేయోభిలాషిగా ఉంటున్నాడు.

వీళ్ళిద్దరూ పని చేస్తున్న సమితికి జనరల్ ఫండ్సు పుష్కలంగా ఉన్నాయి. ఏటేటా ప్రభుత్వం కేటాయించే నిధులు కూడా దండిగా లభిస్తుంటాయి.

ప్రతి సంవత్సరం మహిళా సంక్షేమ కార్యక్రమల పద్దు కింద లక్షన్నర పైచిలుకు ఖర్చు పెట్టడానికి అవకాశ ముంటుంది. చాలా గ్రామాల్లో స్త్రీల గ్రంథాలయాలు, వయోజన విద్యా కేంద్రాలు కుట్టు సెంటర్లు, బాల్వాడీలు నడుస్తున్నాయి బాల్వాడీల్లో, కుట్టు సెంటర్లలో పని చేస్తున్న టీచర్లు పాతిక మంది వరకూ ఉన్నారు. నిజానికి ఈ టీచర్లు కష్టపడి పని చేయటం వల్లనే స్త్రీ సంక్షేమ కార్యక్రమాలనేవి జయప్రదంగా నడుస్తున్నా యనే సత్యాన్ని అంతగా ఎవరూ గుర్తించరు.

కాని, టీచర్ల బతుకులు సమితులు పుట్టి ముప్ఫయి ఏళ్ళు గడిచిన తరవాతకూడా గొర్రెకు బెత్తెడు తోక మాదిరిగానే ఉన్నాయి. ఆ నాటి నించి ఈ నాటి వరకూ వీరివి టెంపరరీ ఉద్యోగాలే. ఇన్నేళ్ళలోనూ నెల జీతం వంద రూపాయలకి మించలేదు. మరీ గతి లేని అనాథలు, అభాగినులు ఈ పోస్టులను అంటి పెట్టుకుని ఉంటారు.

టీచర్లందరూ ముఖ్య సేవికగారి (ఎం.ఎ స్.ఎ) కంట్రోల్లో పని చెయ్యాలి. అందుచేత టీచర్ల నియామకంలో ఎంఎస్ఎ గారిదే ప్రధాన పాత్ర. కొత్తగా నియమించబడ్డ ప్రతి టీచరూ తన మొదటి నెల జీతాన్ని తారాదేవిగారికి వదిలి వేయడం రివాజుగా వస్తున్నదే.

అన్ని రంగాల్లోనూ అణగారిపోయి ఉన్న మహిళల సమున్నతి కోసం అమలు చేసే కార్యక్రమాల్లోకూడా అందినంతవరకు సొమ్ము చేసుకోవడం తారాదేవికి చక్కగా తెలుసు. దేన్లో నయినా తేడా పాడా లొస్తే చక్క దిద్దడానికి శేషగిరి ఉండనే ఉన్నాడు.

దేశం స్వతంత్రం పొందక ముందు ఎలా ఉన్నా, స్వతంత్ర మొచ్చాక మాత్రం డబ్బు లున్న వారందరికీ రాజకీయాల పట్ల, సంఘ సేవ పట్ల ఆసక్తి పెరిగి పోతూ ఉంది. గ్రామ ప్రాంతాల్లోకూడా ఈ వైఖరి తేటతెల్లంగానే కనబడుతోంది. గ్రామగ్రామాన మహిళా సంఘాల నాయకత్వం ధనిక వర్గాల స్త్రీల చేతుల్లోకి పోవడం నేటి సామాజిక న్యాయమయి కూర్చుంది.

మహిళా సంఘాల సభ్యు లందరి ఉమ్మడి అభివృద్ధి కోసమని రకరకాల ప్రోత్సాహక నిధుల్ని, గ్రాంటులను, నగదు రూపంలో బహుమతులను ప్రభుత్వం ఇస్తూ ఉంటుంది. ఇలాంటి నిధుల్ని మహిళా సంఘ అధ్యక్షురాలు లేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఏ భూకామందుగారి భార్యో, సర్పంచ్‌గారి సతీమణో, మరో వృత్తి సంఘ సేవకురాలో సొంత ఖాతాలో జమ చేసుకోవడం మామూలు విషయం.

అయితే ఇలాంటి గొడవల్లో తెలివిగల తారాదేవి జోక్యం కలిగించుకోదు. పైగా వాళ్ళకి లోపాయకారిగా సహాయ పడుతుంది. దాంతో ఉభయత్రా లాభకరంగా వ్యవహారం ముగుస్తుంది.

ఇందుకే పేద వర్గాల స్త్రీలకోసం మహిళా సంఘాలు ఏర్పాటు చేయడమన్నా, హరిజన తదితర లేబరు లొకాలిటీలకు వెళ్ళి పని చేయడమన్నా తగని చిరాకు తారకు. తెల్లారి లేస్తే కూలి కోసం [illegible]గెట్టే పాటకపు స్త్రీలకి స్త్రీ సంక్షేమ కార్యక్రమాల్ని గురించి బోధించ బూనుకోవడం పరమ దండగ అని తార నమ్మకం.

అందుచేత తారాదేవి అమలు చేసే కార్యక్రమాలన్నీ పై తరగతి స్త్రీలకే పరిమిత మవుతుంటాయి.

కాగా-జిల్లా స్త్రీ సంక్షేమ అధికారిణి గారికి, తదితర అధికార్లకు తారపట్ల మంచి గురీ, గౌరవమూ ను. జిల్లా ఆఫీసర్లు విజిట్స్ కొచ్చిన సందర్భాల్లో తారాదేవి సూచనల ప్రకారం ఆ యా మహిళా సంఘాల వాళ్ళు చీర సారెలతో అధికార్లని ఘనంగా మర్యాద చేస్తుంటారు. తార పలుకుబడిని చూచి ఆశ్చర్యపోతూ ఉంటారు అధికార్లు.

**(5)**

ఒక ప్రక్క సంసార జీవితంలో ఏర్పడ్డ వెలితి, మరో ప్రక్క ఉద్యోగ సంబంధమయిన వత్తిడులు తారను శేషగిరికి మరీ దగ్గరగా జరుపుతున్నాయి.

ప్రభుత్వ నిధులు ఖర్చు పెట్టే సమయాల్లో జరిగే బేరసారాల్లో,తదితర సంపాదనా మార్గాల అన్వేషణలో తార, శేషగిరి పరస్పరం సహకరించుకుంటున్నారు. అనేక రీతులుగా దొరికే కమిషన్లను చాలా న్యాయబద్ధంగా వాటాలు వేసుకు పంచుకుంటున్నారు.

ఇవన్నీ ఎలా ఉన్నా కొన్ని రోజుల్నుంచీ వాళ్ళ స్నేహం కొంచెం పరిమితులు దాటుతున్నట్టు ఆఫీసులో వాళ్ళందరి కళ్ళకి కనబడుతోంది.

ఇన్నాళ్ళూ తన జీవితంలోని లోటేమిటో తారకి సరిగా అర్థమయ్యేది కాదు.శేషగిరితో పరిచయమైన



న నాటినించి అదేమిటో స్పష్టంగా గోచరించసాగింది.

ప్రక్క క్వార్టర్సులో ఉంటున్న అగ్రికల్చరల్ డిమాన్‌స్ట్రేటరుగారి భార్య కొత్తగా కాపురాని కొచ్చింది. ఇద్దరిదీ చూడ చక్కని జంట. అన్యోన్యతంటే ఇదీ అన్నట్టుగా ఉంటారు. వాళ్ళ అనురాగాన్ని, చిట్టి పొట్టి జగడాల తరువాత మళ్ళీ అప్పుడే ఏకమయి నవ్వులుపువ్వులు వెదజల్లుకోవడాన్ని కిటికీలోంచి చూస్తూ, గమనిస్తూ ఉంటుంది తార. తన జన్మకి ఇలాంటి అనుభూతు లెప్పుడయినా కలిగాయా? తనకు అన్నివిధాల ఈడూ జోడు అయిన మరో ఆఫీసరు భర్తగా లభించి ఉంటే ఎంత బాగుండేది తన బ్రతుకు! ఇప్పు డేడ్చుకుని ఏం లాభం! స్వయంకృతానికి ఎవరు మాత్రం ఏమనడానికుంది- కనబడని విధి మీద నెపం వేయడం తప్ప.

భరించలేని బాధతో బెడ్‌మీద పడి వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంటుంది తార చాలసార్లు.

శేషగిరి మంచి ఎత్తరి. ఎత్తుకు తగిన లావు. తీర్చినట్టున్న కను ముక్కు తీరు। చూడగానే అందగాడుసుమా అనిపిస్తాడు. మనిషి అందం కంటే మాట లందం ఎక్కువ. చమత్కార సంభాషణతో ఎదుటివాళ్ళ నిట్టే ఆకట్టుకోగలడు. ఒకింత హాస్యప్రియత్వం కూడా ఉండడంతో ఎంతో గంభీరంగా మాట్లాడుతూ మాట్లాడుతూనే హఠాత్తుగా ఓ జోక్ పేల్చే సి అందర్నీ నవ్వుల జల్లుల్లో ముంచి వేస్తూ ఉంటాడు.

శేషగిరికి ఇప్పుడు ఒంటరి బ్రతుకులో ఉండే ఇబ్బందులు క్రమక్రమంగా తగ్గిపోతున్నాయి. వ్యాన్లని బ్రతిమాలి వండించుకుని తినవల సిన అవసరం కలగడం లే దిప్పుడు. తారాదేవి ఆతిథ్యంలో జిహ్వకు రకరకాల రుచులు దొరుకుతున్నాయి.

శేషగిరితో కలి సి భోజనం చెయ్యాలంటే తారకి చెప్పలేనంత ఇష్టం.

అతనితో కబుర్లలో పడిందంటే కాల మెంత గడిచిందీ తెలియదు.

అతని సన్నిధి, సాంగత్యం ఆమెకి గొప్ప రిలీఫ్!

క్రమంగా వారి మైత్రి అనుబంధంగా మారింది.

పాపిరెడ్డి యథారీతిగా వారం వారం వచ్చి వెడుతున్నాడు. అతని కున్న పేకాట పిచ్చును సద్వినియోగం చేసుకుంటున్నాడు శేషగిరి.

ఇప్పుడు రంగం సమితి ఆఫీసు నించి తార ఇంట్లోకి మారింది. ఆదివారం పగలంతా శేషగిరితో పేకాడుతున్నాడు. కాఫీలు, టిఫిన్లు ఆరగారగా అందిస్తూ ఉంటోంది తార.

పాపిరెడ్డి మంచి మూడ్‌లో ఉన్న సమయం కనిపెట్టి శేషగిరి సుగుణాలని పొగుడుతూ ఉంటుంది తార. సమితి ఆఫీసులో నడిచే రాజకీయాల్లో తన కెదురయ్యే చిక్కుల్ని పరిష్కరించుకోవడంలో శేషగిరి ఎంతగా సహాయపడుతున్నదీ వివరిస్తుంది.

శేషగిరంటే ఎంతో అభిమానం రెడ్డికి;తన భార్యకి కొండంత అండగా ఉన్నాడని కృతజ్ఞత.

మేనేజరుగారి అండదండలు పూర్తిగా ఉన్న తారపట్ల సమితిలోని సాటి ఉద్యోగులు తనకెంతో అభిమానం, గౌరవం ఉన్నట్టు నటిస్తున్నారు. చిన్న ఉద్యోగులు ఎక్కడలేని విధేయతను ప్రదర్శిస్తున్నారు.

తారకి పాపిరెడ్డి అనాకారితనం ఈ మధ్య కొట్టొచ్చినట్టుగా కనబడుతోంది.

(సశేషం)

పెద్ద కథ

# మాకు రావు సూర్యోదయాలు

నంబూరి పరిపూర్ణ

**(క్రిందటి సంచిక తరువాయి)**

**తారాదేవి** ఇంటినించి తిరిగి బాలసదనంలోకి వచ్చి పడగానే అక్కడి వాతావరణమంతా కొత్త కొత్తగా, ఊపిరాడనట్టుగా అనిపిస్తోంది శ్యామలకి.


తోటి పిల్లలతో ఇదివరకులా కలిసి మెలిసి ఉండలేక పోతున్నది.

తారాదేవిగారిది చక్కని పొందికయిన ఇల్లు. అందులోని అందమయిన ఫర్నిచరు, షోకేసులో ఉన్న అందమయిన బొమ్మలు, చుట్టూ ఉన్న పూల తోట మాటి మాటికీ మనసులో మెదులుతున్నాయి శ్యామలకి. స్నేహితురాళ్ళతో ఎప్పుడు మాట్లాడినా తారాదేవిని గురించి, ఆమె గొప్పతనాన్ని గురించీ మాట్లాడుతూ ఉంటుంది.

శ్యామలకి పాఠాలమీద శ్రద్ధ సన్నగిల్లుతోంది. పుస్తకంమీద ధ్యానం ఉండడం లేదు. స్టడీ అవర్సులో పేరుకు పుస్తకాలు ముందేసుకు కూర్చుంటున్నది. చదవడం మొదలు పెట్టీ పెట్టగానే ఆలోచనలు తార ఇంటి వైపు పరుగులు పెడుతున్నాయి. తను ఇక్కడికి పయనమై వచ్చే ముందు తారాదేవి చెప్పిన సంగతులు గుర్తుకొచ్చినప్పుడల్లా మనసు సంతోషంతో పైపైకి ఎక్కడికో ఎగిరి పోతున్నట్టుగా ఉంటోంది.

మరో నాలుగు నెలలకి తను ఇక్కడి నించి బయట పడుతుంది. ఇహ ఆ మీదట మేట్రనుగారి అదిలింపులు, వంట మనిషి గదమాయింపులు, పెద్ద క్లాసు పిల్లల పెత్తనాలు తన కేం ఉండవు. తారమ్మగారి చల్లని నీడలో హాయిగా, నిశ్చింతగా చదువుకుంటుంది తను.

ఎంత మంచి అండను చూపించాడు భగవంతుడు తన లాంటి దిక్కులేని దానికి!



**(6)**

ఏప్రిలు నెల చివరి వారం. బాలసదనం పిల్లలంతా సంవత్సర పరీక్షల కోసం దీక్షగా చదువుతున్నారు. హోమ్ అంతా పరీక్షల వేడితో నిండిపోయి ఉంది.

నలుగురితోపాటు శ్యామల కూడా పరీక్షలు రాసింది. వేసవి సెలవు లిచ్చారు.

హోమ్ పిల్లలు చాలామంది శెలవుల్లో ఇళ్ళకెళ్ళి వస్తుంటారు. పిల్లల్లో తల్లీ తండ్రీ లేని పూర్తి అనాధలు, తల్లో తండ్రో ఒక్కరయినా బతికి ఉన్న పాక్షిక అనాధలూ అని రెండు విధాలుగా ఉంటారు. పూర్తిగా అనాధులయి, తమని ఇళ్ళకు పిలుచు కెళ్ళడానికి దగ్గరి చుట్టాలయినా లేని పిల్లలు శెలవుల కాలంకూడా హోమ్‌లోనే గడిపేస్తారు. తల్లో, తండ్రో బతికున్న వాళ్ళకి ఇళ్ళ కెళ్ళి వచ్చే అవకాశ ముంటుంది. ఆ బాపతు పిల్లలే కొంత మంది ఈ రోజున ఊళ్ళకి పయన మవుతున్నారు. కొందరప్పుడే బయలుదేరి వెళ్ళిపోయారు.

ఒక్కొక్కళ్ళూ వెళ్ళిపోతోంటే దిగాలు పడి చూస్తో నుంచుంది శ్యామల.

వేసవి శెలవుల్లోకూడా తన వద్దకి శ్యామలని పంపమంటూ ఉత్తరం రాస్తాననీ, అందుకు సూపర్నెంటుగారు తప్పక అంగీకరిస్తారని తారమ్మగారు నమ్మకంగా చెప్పింది శ్యామలకి ఆమె బయలుదేరి వస్తున్నప్పుడు. ఆమె నించి ఇంకా ఉత్తర మొచ్చినట్టుగా లేదు. పిల్లలంతా వెళ్ళిపోతున్నారు; హోమ్ అంతా ఖాళీగా, బోసి బోసిగా అవుతోంది.

శ్యామలకి ఒక్కసారిగా నీరసం వచ్చింది.

సూపర్నెంటు హేమలత వెళ్ళిపోతున్న పిల్లల్ని సాగనంపి ఆఫీసు రూములోకి రాగానే ఓమూలగా దిగాలుపడి నించుని ఉన్న శ్యామల కనబడింది. హేమలతకి కొంచెం ఆశ్చర్యం కలిగింది.

"ఏమిటమ్మా, శ్యామలా! ఒక్కదానివే ఇక్కడున్నావేమిటి? నీ స్నేహితు లంతా వెళ్ళిపోతుంటే సాగనంపడానికి రాలేదేం?"

అమ్మగారి పలకరింపుతో శ్యామల కళ్ళు నిండుకొచ్చాయి. ఉబికి వచ్చే ఏడుపును ఆపుకోవాలని ప్రయత్నిస్తోంది.

"అరె! ఏడుస్తున్నా వెందుకు? ఏమయింది? ఒంట్లో బాగా లేదా? లేకపోతే మేట్రనుగా రేమయినా కేకలేశారా?"

LINTAS PS 62 2720 TL

శ్యామల గొంతు దుఃఖంతో మూసుకుపోయి, నొప్పిగా ఉంది. మాట పెగలటం లేదు.

"ఏమి టమ్మాయ్? ఎంతడిగినా ఏమీ చెప్ప కుండా అలా ఊరికే ఏడుస్తున్నావేమిటి? అస లేమిటి నీ కొచ్చిన బాధ?"

శ్యామల జవాబు చెబుదామని ప్రయ త్నించింది. అతి నెమ్మదిగా, అస్పష్టంగా ఉన్న ఆమె మాటలు హేమలతకి ఏమాత్రం అర్థం కాలే దు.

"ఊ! త్వరగా, నా క్కాస్త అర్థమయ్యేటట్టు చెప్పు, శ్యామలా! ఇవతల నాకు బోలెడు ఆఫీసు పనుంది. ఏమీ చెప్పదలుచుకోకపోతే తిన్నగా నీ రూములో కెళ్ళి తీరుబడిగా ఏడువ్. నా ముందు నిలబడి మాత్రం అలా ఏడవకు" విసుగుతో అంది హేమలత.

శ్యామల దుఃఖం ఠకీమని ఆగింది. "ఏమీ లేదమ్మా! అందరూ ఊళ్ళ కెళ్ళి పోతున్నారు. నేనూ వెళ్ళలేక పోతున్నాను కదా అని ఏడుపొస్తున్నది."

"నువ్వుకూడా వెళ్ళడమా..ఎక్కడి కట?"

"తారమ్మగా రింటికే నమ్మా! వేసవి సెలవుల్లో కూడా మళ్ళీ రమ్మని చెప్పారమ్మా."

"ఏమిటీ! మళ్ళీ తారమ్మగా రింటికా? ఒకసా రెళ్ళొచ్చావుగా! మాటి మాటికీ వెడితే ఏం బాగుంటుందీ? అదేం వీలు పడదు కానీ, హాయి గా హోమ్‌లోనే ఉండి నీకు రాని సబ్జక్ట్‌లన్నీ బాగా చదువుకో."

"మళ్ళీ రమ్మని అమ్మగారే మరీ మరీ చెప్పార మ్మా! పంపమని మీకు ఉత్తరం కూడా వ్రాస్తా మన్నారు. వ్రాయలే దామ్మా?"

"ఏదీ...అలాంటి దేం రాలేదే ఇంతవరకూ?"

"ఈ శెలవులు రెణ్ణెల్లూ లెఖ్ఖలవీ బాగా నేర్పుతా మన్నారు. మొన్న శెలవుల్లో నేను వారింట్లో ఉన్న ప్పుడు నిజంగా కన్నతల్లికంటే ఎక్కువగా చూశార మ్మా!"

శ్యామల మాటలు వింటూనే ఆరో జొచ్చిన టపా చూడ్డానికి ఉద్యుక్తురా లయి కవర్లు చించుతోంది హేమలత. వాటిలో సుపరిచితమైన దస్తూరీతో ఉన్న కవ రొకటి ఆమె దృష్టి నాకట్టుకుంది.

ఆ ఉత్తరం తార వ్రాసింది. మళ్ళీ ఈ వేసవి శెలవులకి కూడా శ్యామల్ని తనింటికి పంపమని మరీ మరీ కోరుతూ వ్రాసింది. తనకి ఒంట్లో బాగుండడంలేదనీ, ఆఫీసు పనుల వత్తిడి కూడా ఎక్కువగా ఉందనీ, శ్యామల్ని పంపితే తనకి కాస్త చేదోడుగా ఉంటుందనీ వ్రాసింది. అంతేగాక ఈ రెణ్ణెల్లూ ఆ పిల్లకి ట్యూషను ఏర్పాటుచేసి శ్రద్ధగా చదివించగలనని కూడ వ్రాసింది.

ఉత్తరం చదవడం ముగించి, నవ్వుతూ శ్యామ ల్ని చూచి, "నీ రొట్టె విరిగి నేతిలో పడింది, శ్యామలా! తారమ్మగారినించి ఉత్తరం ఇప్పుడే వచ్చింది. నిన్ను తప్పకుండా పంపించమని వ్రాశా రు. ఇక బయల్దేరు. పెట్టె, బట్టలు సర్దుకో, వాచ్‌మ న్‌ని పంపుతాను తోడుగా బస్టాండుకి."

## (7)

ముఖ్య సేవిక తారాదేవి ఇంటికి మేనేజర్ శేషగిరిరావు రాకపోకలు అధికమయినయ్.

ఇరుగుపొరుగు క్వార్టర్సు జనాల గుసగుసలు, విమర్శలు కూడ అదే నిష్పత్తిలో అధికమయి నయ్.


సాటి ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్లకీ, ఆఫీసు గుమాస్తాల బృందానికీ తార-శేషగిరుల వ్యవహారం ఒక మంచి ఆసక్తికరమయిన, రసవంతమైన టాపిక్కయింది.


ఇహ ఇంటిపట్టునే ఉంటూ కబుర్లూ కాకరకా యలతో గడిపే వారి భార్యలకి తార వ్యక్తిగత విషయాల్ని గురించి రోజంతా చర్చిస్తూ, తల కో వ్యాఖ్యానం చెయ్యడం మామూ లయ్యింది. భర్త ల్ని కాంపులకి పంపి, పిల్లల్ని స్కూళ్ళకి తరిమాక మహిళా మండలి సమావేశం ప్రారంభ మవు తుంది. తార గురించిన ఒక్కో తాజా కబురూ, ఒక్కో కొత్త కథా ఒక్కో ఇల్లాలి ద్వారా సమావేశం ముందుకొస్తూ ఉంటుంది. దాంతో అమ్మలక్కల చర్చకు కొత్త ఊపు దొరకగా గంటల తరబడి ఇళ్ళు వాకిళ్ళు పూర్తిగా మరిచిపోయేలా చేస్తూంది.

ఆడిపోతలకు, సూటీ పోటీ మాటలకు భయపడే ఘటం కాదు తార.

రెడ్డితో పొత్తు కుదుర్చుకున్న నాడే లోకాన్ని ఖాతరు చేయడం మానుకుం దామె. కాని, కొన్ని రోజుల్నుంచీ తన సొంత కొడుకే మొదలు పెట్టా డు—తల్లిని సాధించడం. వీడి సతాయింపుల్ని మా త్రం భరించలేకుండా ఉంది.

నిరంజన్‌తోపాటు చదువుకుంటున్న ఇరుగు పొరుగుల వాళ్ళ పిల్లలూ, వాళ్ళని చూసి ఊళ్ళో పిల్లలూ స్కూలు కెళ్ళగానే అతణ్ణి చూచి తమలో తాము ఏవో చెప్పుకుని ఒక్కసారిగా అందరూ కలిసి పగలబడి నవ్వుతున్నారు. ఏవేవో మాటలు విసురుతూ గేలిచేస్తున్నారు. మొదట్లో వాళ్ళేమి అంటున్నదీ అర్థమవలేదు వాడికి. క్రమక్రమంగా అర్థమవుతూ ఉండడంతో తల కొట్టేసినట్లవు తోంది; గట్టిగా ఏడవా లనిపిస్తున్నది.








తన తల్లి ఆ మేనేజరు విషయంలో చూపుతున్న మర్యాదలో, చేస్తున్న అతిథి సత్కారంలో ఒక విధమయిన అసహజత్వం కనిపిస్తోంది నిరంజన్‌కి. అదే సమయంలో ఆమె తనపట్ల ఇన్నేళ్ళుగా చూపుతున్న ప్రేమ వాత్సల్యాలు తగ్గిపోతున్నట్లు కనబడి విపరీతమయిన మానసిక వ్యథ కలుగుతోంది ఆ కుర్రవాడికి.

తనకన్నా ఆ మేనేజరు ఎక్కువయినాడా అమ్మకి?

అసలు అతనెవరు? తమ చుట్టమా పక్కమా? ఆ మేనేజరుతో కలిసి అలా ఉత్తపుణ్యానికి నవ్వుతూ కూర్చుంటుం దెందుకు అమ్మ? గంటల తరబడి ఆ ముచ్చట్లేమిటి? ఛ! అమ్మ కసలు ఈ మధ్య తన ధ్యాసే ఉండడంలేదు. ఆ మేనేజర్ని చూస్తే చాలు ఒళ్ళు మండిపోతున్నది. వాడింటికొస్తే చాలు అరికాలి మంట నెత్తికెక్కి పోతున్నది.

ఈ మధ్య ప్రతి చిన్న విషయానికి అర్థంపర్థం లేని పేచీలు పెడుతూ తల్లిని విసిగిస్తున్నాడు నిరంజన్. మొండిగా వాదిస్తున్నాడు. మితిమీరి ఎదురు చెబుతూ, ఒక్కోసారి వయసుకి మించిన మాటలు మాట్లాడుతూ తల్లితో దెబ్బలు తింటున్నాడు.

వాస్తవానికి చిన్నప్పటినించీ తండ్రి అంటేనే ఎక్కువ అపేక్ష నిరంజన్‌కి. పాపిరెడ్డి కూడ కొడుకుని కాస్త మోతాదుకి మించి గారాబం చేస్తూ వచ్చాడు. వాడేది కావాలని అడిగినా వెంటనే కొనిస్తాడు. వారాని కోమాటు వచ్చిపోయే తండ్రికి తల్లిమీద ఏవేవో చాడీలు చెబుతుండడం వాడి కలవాటు. అవన్నీ ముచ్చటగా విని కొడుకుని సమర్థిస్తూ, తార మీద ఉత్తుత్తి కేకలేస్తూ ఉండడం రెడ్డి కలవాటు.

ఇప్పుడు తల్లిమీదా, శేషగిరి మీదా గుండెలో రగులుతున్న కసినీ, ఉక్రోషాన్ని తండ్రిముందు ఎప్పుడు కక్కేద్దామా అని ఆదివారం నాడు వచ్చే తండ్రికోసం ఎదురుచూస్తున్నాడు నిరంజన్.

ఈ సారి శనివారం రాత్రికే పాపిరెడ్డి వచ్చాడు. తార కాంపు నించి బాగా పొద్దుపోయి వచ్చింది. ఈ లోపుగా నిరంజన్ తన సుదీర్ఘమైన రిపోర్టును సమర్పించాడు తండ్రికి.

ఆ వారంలో తమ ఇంటికి మేనేజరు శేషగిరి ఎన్నిసార్లు వచ్చిందీ, ఎన్నిసార్లు భోజనం చేసిందీ, ఎంతెంత ప్రొద్దుపోయేవరకు కాలం గడిపిందీ-అన్నీ ఉన్నాయి ఆ రిపోర్టులో.

నిరంజన్ మాటలు చాడీలుగానే, సిల్లీ విషయాలుగానే తోచి వాడి కేవేవో కబుర్లు చెప్పి సముదాయించాడు రెడ్డి.

మళ్ళీ ఆదివారం నాడు కూడా నిరంజన్ మునుపటి తీరుగానే ఆక్రోశించాడు తండ్రి ముందు.

ఈ సారి కాస్త గట్టిగా కేకలేసి కొడుకు నోరు మూయించాడు రెడ్డి. అయితే, లోకుల నోరు మూయించే శక్తి లేకపోయింది. బ్రాడ్‌కాస్టింగ్, రిలే బ్రాడ్ కాస్టింగ్ జరిగి జరిగి రెడ్డిగారి కర్ణేంద్రియాల్లో హోరు మొదలయింది.

క్రమంగా శేషగిరి తారతో ప్రవర్తిస్తున్న తీరు మరో విధంగా కనబడసాగింది రెడ్డికి.

## (8)

చిల్డ్రెన్స్ హోమ్‌కి శాశ్వతంగా గుడ్‌బై చెప్పి వచ్చేసిన శ్యామల్ని చూచి తార మిక్కిలి సంతోషించింది.

శ్యామల తనకి చేదోడు వాదోడుగా తనింట్లో పిల్లలాగ మసుల్తూ, చదువుకూడా శ్రద్ధగా చదువుకుంటూ పైకొస్తే మంచి ఉద్యోగం వేయించుతుం దామెకి. ఆ తరువాత మంచి సంబంధం కూడా చూచి తన చేతుల మీదుగానే పెళ్ళి చేస్తుంది.

ఇలాంటివే మరికొన్ని వాగ్దానాలు శ్యామల్ని అంబర వీథుల్లో నడిపిస్తున్నాయి. తారమ్మగారు దేవతేగాని, మనిషిమాత్రం కాదు అని అనుకునేట్టు చేస్తున్నాయి.

ఉన్నట్టుండి తారాదేవి జవాను వీరయ్యను బి.డి.ఒ. తన ప్యూనుగా వేసుకున్నాడు. ఎమ్. ఎస్. గారికి చక్కగా వంటా వార్పూ చేసి పెడుతూ, అన్ని విధాల ఆమెకి అండదండలుగా ఉన్న వీరయ్య మీద బి.డి.ఒ. భార్య చాల రోజుల బట్టి చూపేసి ఉంచింది. పెళ్ళాం పోరు పడలేక కనీసం తారతో మాట మాత్రమయినా చెప్పకుండా వీరయ్యని ఆమె నించి లాక్కున్నాడు బి.డి.ఒ.

ఇప్పుడు తారకి కుడి భుజం విరిగినట్టుగా అయింది. పల్లెటూళ్ళో పనిమనుషు లుండరు. అంట్ల దగ్గరినుంచీ అన్నీ ఒక్క చేత్తో చేసుకోవాలి. అసలే తనది వచ్చే పోయే కొంప. మహిళా సంఘాల వాళ్ళు, బాంకు ఋణాలు ఇప్పించమని పోరే వాళ్ళు, కుట్టు టీచర్లు, బాల్వాడీ టీచర్లు...నిత్యం ఎవరో ఒకరు వస్తూ పోతుంటారు. వేళాపాళా లేని డ్యూటీలు, కాంపులు, జిల్లా ఆఫీసర్ల విజిట్సు, ఇన్‌స్పెక్షన్ల బెడద జాస్తి తారకి.

వెనక ఎవరో ఒకరుండి ఇల్లు సంభాళించుకోకపోతే గడవని స్థితి ఏర్పడింది. వీరయ్య ఉన్నంతకాలం నిశ్చింతగా, హాయిగా గడిచిపోయింది. కాని, ప్యూన్లు స్థిరంగా ఎప్పుడూ ఒకరి దగ్గరే ఉంటా రనే దేముంది? అందుకే ఇంట్లోనే ఉంటూ పని పాటలు బాగా చేస్తూ, ఇల్లు దిద్దగల పిల్లకోసం చాలాకాలం నించీ అన్వేషిస్తూ వచ్చింది తార.

ఇన్నాళ్ళకి తన ప్రయత్నాలు ఫలించి, తను కోరుకున్న లక్షణాలన్నీ ఉన్న పిల్ల-శ్యామల రూపంలో లభించింది.

శ్రద్ధగా చదువుకుంటూ, ఏ క్లాసూ ఫెయిలవకుండా ముందుకు పోతూ ఉంటే మంచిదే. చదువుపట్ల ఆసక్తి చూపనట్లయితే తగినవా ణ్ణెవణ్ణయినా చూచి ముడి పెట్ట వచ్చు. పెళ్ళి గురించయినా ఇంకా ఐదారేళ్ళ వరకూ తొందరపడాల్సిందేమీలేదు.

తార శ్యామలకి ఇంటి పనులన్నీ ఒక్కొక్కటే నేర్పింది. శ్యామల అన్ని రకాల కూరలు, రకరకాల టిఫిన్లు రుచిగా తయారు చెయ్యడం నేర్చుకుంది. తారాదేవితో చెప్పించుకోకుండా పనులన్నీ తనంత తనే ఓ క్రమపద్ధతిలో చేసుకుపోయే స్థితికి వచ్చింది.

త్వరత్వరగా, పరిశుభ్రంగా పనులన్నీ చేసి ముగించి తారమ్మగారి మెప్పు పొందాలని తాపత్రయపడుతూ ఉంటుంది శ్యామల.

తారాదేవి ఇంటికొచ్చాక పనిపాటల్తోబాటు కొత్త కొత్త అలవాట్లు అబ్బాయి శ్యామలకి. తారమ్మగారి ప్రోత్సాహంతో స్నోలు, పౌడర్లు, సెంట్లు ధారాళంగా వాడ్డం నేర్చుకుంది. స్నానం తరువాత ఒంటినిండా స్ప్రే జల్లుకోవడం, టాల్కం పౌడరు ఒళ్ళంతా పట్టించడం కూడ నేర్చుకుంది. దుస్తులకి మ్యాచయ్యే గాజులు, రంగు రంగుల బొట్లు, నకిలీ గొలుసులు తెచ్చి ఇస్తూ ఉంటుంది తార శ్యామలకి.

అదేపనిగా అలంకరించుకోవడం, ఆకర్షణీయంగా కనబడాలని ప్రయత్నించడం-తారనించి కాపీ చేసింది శ్యామల.

ముద్దుగా, వెన్నముద్దలా ఇల్లంతా కలియ దిరుగుతూ, చకచకా పనులు చేసుకుపోయే ఈ కొత్త పిల్ల ఎవరో తార ఇంటికి వచ్చిపోయే వాళ్ళకి అంతుబట్టలేదు. "ఎవరండీ ఈ పాప, ఇదివరకెప్పుడూ మనింట్లో చూళ్ళేదు?" అని అడుగుతారు కొందరు కుతూహలంగా.

"ఔను, ఇంతకుముం దెప్పుడూ రాలేదు మా శ్యామల. మా దూరపు చుట్టా లమ్మాయి. వీళ్ళమ్మ నాకు అక్క వరస అవుతుంది. వీళ్ళది చాల పేద సంసారం. ఐదుగురు పిల్లలు. పాపం తండ్రికూడ ఈ మధ్యనే పోయాడు. నాకూ ఆడపిల్లలు లేరు గదా అని తెచ్చి పెంచుకుంటున్నాను."

"పండులాంటి చక్కని పిల్ల దొరికిందమ్మా!

ముచ్చటగా పనులన్నీ చేసి పెట్టగల ఎదిగిన కూతురు దొరకడం నీ కెంత అదృష్టమమ్మా!" కించిత్ అసూయ రంగరించి మెచ్చుకోలుగా అంటారు వాళ్ళు.

(8)

ఇదివరకులా శేషగిరి ఇంటికొస్తే గౌరవంగా పలకరించి, కూర్చోబెట్టడంలేదిప్పుడు పాపిరెడ్డి. తారతో కూడ అతి ముక్తసరిగా మాట్లాడుతున్నాడు. ఒకటీ అరా మాట్లాడినా అవి సూటీ పోటీ మాటలే తప్ప మరేమీ కావు.

రెడ్డిగారిలో వచ్చిన మార్పు స్పష్టంగానే అర్థమవుతున్నది తారకి.

ఇద్దరి మధ్య కోల్డు వార్ మొదలయ్యింది.

రోజు రోజుకీ రెడ్డిగారి సాధింపుల మోతాదు పెరుగుతోంది. రెడ్డి శేషగిరి విషయంలో తారమీద బహిరంగ యుద్ధమే ప్రకటించాడు. వాక్బాణాలు విసురుకొన్నారు చాలా సేపు. రకరకాల దెప్పుళ్ళు కూడ అయినాయి. తార ఏడ్చింది, మొత్తుకుంది.

అయినా పాపిరెడ్డి మనసులో ఏర్పడ్డ శంక అలా స్థిరంగానే ఉంది. చివరకు ఒక ఆజ్ఞలాంటి దాన్ని ప్రకటించాడు—

"ఆ భటాచోర్ ఇకనించి మన గుమ్మ మెక్కడానికి వీల్లేదు. నా మాట కాదని మళ్ళీ వాణ్ణి రానిచ్చావో ఇంక నీకు నే నుండను. బాగా గుర్తుంచుకో ఈ మాట."

ఫైనల్ వార్నింగ్ ఇస్తూనే చెప్పుల్లో హడావుడిగా అడ్డదిడ్డంగా కాళ్ళు దూర్చి సొంత ఇంటిని వెదుక్కుంటూ వెళ్ళిపోయాడు రెడ్డి.

(9)

సకల ఆర్భాటాలతో వేసవి ప్రవేశించింది.

ఉదయం ఆరు గంటల్నించీ వడగాడ్పులు మొదలవుతున్నాయి. హెూరుమంటూ పిచ్చిగా వీస్తున్నది గాలి. గుమ్మాల్లోంచి ముఖం బయటికి చూపడానిక్కూడా జనం వెరుస్తున్నారు.

ముఖ్యంగా పాటకజనానికి వేసవి కాలం మరీ గడ్డు కాలం. తార పని చేస్తున్న సమితి కార్యాలయం ఉన్న ఊరు, ఆ ఊరితో పాటుగా సమితిలో ఉన్న ఊళ్ళన్నీ పూర్తిగా మెరక ప్రాంతం. దాళ్వాసాగు ఇంకా ఈ ప్రాంతంలోకి రాలేదు. అందుచేత కోసిన వరి దుబ్బు మొదళ్ళు తప్ప పొలాల్లో పచ్చదనమనేది కనబడ్డం లేదు. ఎండి నెర్రలు విచ్చింది నేల.

కూలినాలి జనం చెయ్యడానికి పనుల్లేక తిండికి మాడుతున్నారు. ఎప్పుడయినా ఒకటీ రెండు రోజులు వరి మళ్ళలో గడ్డ విరపడానికి ఆసాములు పిలుస్తూ ఉంటారు. అడపా దడపా తప్పకం పనులు తప్ప మరేం పనులు దొరకవు.

బావులన్నీ ఒట్టిపోయి. కడుపు నిండా నీళ్ళు తాగి బతుకుదామన్నా వీల్లేక పోతోంది పేదజనానికి.

పులిమీద పుట్రలా ఊళ్ళకి ఊళ్ళే తగలబడి పోవడంకూడా ఆరంభమయ్యింది. ఏ రోజున, ఏ క్షణంలో తమ గుడి సెల్ని అగ్ని దేవుడు బలిగొంటాడో, పిల్లా జెల్లాతో ఏమై పోవాలో నన్న ఆతుర్దా వల్ల బీదా బిక్కీ రాత్రిళ్ళసలు ఆదమరచి నిద్రపోవడం లేదు.

కలిగిన మారాజులు ఎండల్నీ, గాడ్పుల్నీ తమ అదుపులో ఉంచుకో కలుగుతున్నారు. పల్లెటూళ్ళలో నివసిస్తున్నా, డబ్బున్న వాళ్ళకి అన్నీ అందుబాటులోకి వచ్చాయి. ఒకప్పటి వట్టివేళ్ళ తడికల దశను దాటి గదులు ఎయిర్ కండిషనింగ్ చేయించుకునే స్థాయి కెదిగిపోయారు స్థోమత ఉన్న వాళ్ళందరూ.


వేసవి కాలంలో తారాదేవి ఇల్లు ఒక చక్కని చలివేంద్రంగా మారిపోతుంది. పగటి పూట తలుపులు, కిటికీలు ఎప్పుడూ మూయబడే ఉంటయి. గది గదికీ ఎయిర్ కూలర్సు, సీలింగు ఫానులు అలసట లేకుండా తిరుగుతుంటాయి. బయటి ఎండ ఇంట్లోకి ఏ మాత్రం రేడియేట్ కాకుండా తీసుకో వలసిన జాగ్రత్తలన్నీ తీసుకుంటుంది తార.

రకరకాల కూల్ డ్రింక్సూ, సాలాడ్స్ నేర్పుగా తయారు చేసి ఎప్పటికప్పుడు ఫ్రిజ్‌లో ఉంచుతుంది తార. వేసవి గడిచి పోయేవరకూ ఫ్రిజ్ వాటరు తప్ప మరొకటి తాగలే దామె.

ప్రతి వేసవీ తార ఇంట్లోనే గడుపుతుంటాడు పాపిరెడ్డి. ఆధునిక అభిరుచు లున్న తార జీవితాన్ని వీలయినంత సుఖవంతం చేసుకో గల్గుతుండగా అష్టైశ్వర్యాల్లో మునిగి తేలే తన భార్య అక్షర

MCA-MCS-52-TEL






మ్ముక్క రాని దపటాన దేన్నీ అనుభవించే తెలివి లేనిదని పాపిరెడ్డికి తెలుసు. అందుకే ప్రత్యేకించి ప్రతి వేసవిలో తారింట్లోనే ఉండి పోవడానికి ఇష్టపడతా డతడు.

వ్యవసాయపు పనులు, మనూళ్ళు పూర్తి చేసుకుని తారింట్లో హాయిగా గడుపుదామని వచ్చాడు రెడ్డి. ఎక్కడికీ కదలడం లేదు. అలా కదలకుండా ఉండిపోడానికి బలమైన కారణం ఉంది. తార ప్రవర్తన మీద సందేహం కలిగినప్పటినించీ ఆమెనొదిలి దూరంగా ఉండకూడదని నిశ్చయించుకున్నాడు.

అసలే తనది పొద్దు వాటారిన వయసు. పిట్ట కొత్త పుంతలు వెదుకుతున్నట్టుంది. గట్టిగా పట్టుకోవాలి; లేకపోతే చేతిలోంచి తుర్రున జారిపోవచ్చు.

ఇప్పుడు అహర్నిశలు తారనే అంటి పెట్టుకుని ఉంటున్నాడు. ఆమె ప్రతి కదలికను డేగ కళ్ళతో వెంటాడి చూస్తున్నాడు. ఆమెని అలా చూస్తున్న కొద్దీ కసితో మిళితమైన కామం అతన్నే ప్రకోపిస్తున్నది. ఆమె యౌవన సంపదమీద తన కొక్కడికే పూర్తి అధికార మన్నట్టు—లేని సత్తువ తెచ్చుకుని ఆమెని అనేక విధాలుగా చికాకు పెడుతున్నాడు.

రెడ్డి వ్యవహారం ఏవగింపుగా ఉంటోంది తారకి. అతను ఇదివరకెప్పుడూ ఇలా విజృంభించి ప్రవర్తించలేదు. తను చక్కగా ముస్తాబయి, ముందు నిలబడితే చాలు-అతని కడుపు నిండిపోయేది.

కమ్మని భోజనం పెట్టి, మందుగ్లాసు చేతి కందిస్తే చాలు మురిసి పోతూ తాగి మగత కమ్మి మంచంమీద వాలిపోయేవాడు. అంతే. తెల్లవారి తొమ్మిదయ్యేవరకూ అతని వల్ల తారకి ఎలాంటి చికాకూ ఉండేది కాదు.

ఇప్పు డేమిటీ...ఇంత విచిత్రంగా మారాడు!

మళ్ళీ కుర్రాడిగా మారి పోవాలనుకున్నట్టుంది!

తారకి రెడ్డంటే చిరాకూ, జుగుప్సా కలుగుతున్నాయి. రెడ్డికి తార పట్ల రోజు రోజుకీ కసి పెరిగిపోతున్నది.

శేషగిరి సాంగత్యం లభించాక రెడ్డిని భరించడం మహా కష్టంగా ఉంది తారకి. అతని వికృతరూపం ఇప్పుడు మరింతగా, భూతద్దంలోలాగ కనపడుతూ కంపరం పుట్టిస్తోంది.

అందమయిన ఈ సాయం సమయాన్ని శేషగిరితో కలిసి పంచుకుంటే ఎంత హాయిగా ఉంటుంది!

వికసిత పుష్పాల మృదు సౌరభాలతో మత్తెక్కిన వసంత గాలులు ఇంటికి నలు వైపులా చుట్టి ఉన్న తోటలో మంద మందంగా వీస్తూ, ప్రతి మొక్కను, ప్రతి కొమ్మను, ప్రతి రెమ్మను ఊపి ఊపి మరీ పలకరిస్తున్నాయి.

సంధ్యా కాంత కౌగిలిలో ఎప్పుడెప్పుడు వాలిపోదామా అని తన సహస్ర బాహువుల్ని చాపుతూ సూర్యదేవుడు పరుగు పరుగున పశ్చిమాద్రికి పోతున్నాడు. ప్రియుని సమాగమం వల్ల సిగ్గుతో ఎరుపెక్కిన సంధ్యా కాంత బుగ్గల విచిత్ర కాంతులా అన్నట్టు సాయంకాలపు నీరెండ ప్రకృతి నంతా బంగారు రంగులో ముంచి వేస్తోంది.

మనోజ్ఞ సాయంసంధ్యలు వృధాగా గడిచిపోతున్నాయి. రెడ్డి ఇంట్లో తిష్ట వేసుక్కూచోకపోతే ప్రతి సాయంకాలం తనకూ, శేషగిరికీ తియ్యని అనుభవాన్ని అందించేది. శేషగిరితో కబుర్లలో పడిపోవడం ఒక గొప్ప అనుభూతి. ఆ కబుర్లకి ఆది, అంతం ఉండదు.

అసలు శేషగిరితో కూర్చుంటే కాలం ముందుకి జరగదు. ప్రతి చిన్న విషయాన్ని, ప్రతి చిన్న మాటని అతను వర్ణించే తీరు తనని నవ్వుల జల్లుల్లో ముంచెత్తుతుంది.

ఇప్పుడు తనకి రోజులు బహు దీర్ఘంగా, బరువుగా అనిపిస్తున్నాయి.

వయసుండి ఏం ప్రయోజనం?

ఎందుకు వృధా పుచ్చాలి తన జీవితాన్ని!

అన్ని హంగులూ, సౌఖ్యాలూ ఉండికూడా ఇల్లంతా ఇరుకైపోయినట్టు, ఊపిరాడనట్టుగా ఉంటున్నది తారకి.

ఇది అని చెప్పుకోలేని అసంతృప్తి, బెంగ మనసుని మెలి పెడుతోంది.

ఎవర్ని చూసినా అకారణంగా కోపం వస్తోంది. ఆఫీసులో ఉన్నా—ఇంట్లో ఉన్నా, తింటున్నా—తాగుతున్నా మనసు దేనిమీదా లగ్నం కాక ఏవేవో లోకాలకి ఎగిరిపోతూ దేనినో నిరంతరం అన్వేషిస్తూంది.

(10)

ప్రచండ వేసవిని సాగనంపి, వర్షఋతువు నాహ్వానిస్తోంది ప్రకృతి.

జూన్ నెల చివర వారంలో పరీక్షల ఫలితాలు పేపర్లలో వచ్చాయి. తార కొడుకు పదో తరగతి పరీక్షలు రాసి ఉండడం చేత ఫలితాల కోసం ఆదుర్దా పడుతూ పేపర్లన్నీ వెదికారు తల్లీ కొడుకూ కలిసి.

నిరంజన్ నంబరు కంటపడలేదు ఒక్క పేపర్లో కూడా. ఆ తరవాత ఒక వారానికి శామల రిజల్ట్సు కూడా తెలియజేసింది సూపర్నెంటు హేమలత.

నిరంజన్‌కి తోడుగా శ్యామలకూడా ఫెయిలయి కూర్చుంది. కొడుకు ఫెయిలయినందుకు బాధ కన్నా, అవమానంతో ఎక్కువ క్రుంగిపోయింది తార.

"మా అబ్బాయికి తప్పకుండా ఫస్టు క్లాసొస్తుంది" అంటూ అందరికీ ధీమాగా చెబుతూ వచ్చింది. తీరా వాడు అన్ని సబ్జక్ట్సు పక్షపాతం లేకుండా తప్పి కూర్చున్నాడు.

తల నేల కేసి కొట్టుకుంది; పిల్లవాణ్ణి చెడామడా తిట్టింది. చివరకు కోపం తీరక చెయి చేసుకుంది. ఒంటిమీద రెండు మూడు దెబ్బలు పడగానే తల్లిని తిట్టడం మొదలెట్టాడు వాడు. ఆ తిట్లు చిన్న పిల్లాడికి తగ్గట్టుగా లేవు. అతి నీచంగా, చుట్టుపక్కల వాళ్ళ చెవిని పడితే పరువంతా పోయేట్టుగా ఉన్నాయవి. తనకి తెలియకుండానే, నిరంజన్ తల్లిని బ్లాక్ మెయిల్ చేస్తూ తిడుతున్నాడు.

ఊహించని ఈ పరిణామానికి తార ప్రస్నుడిపోయింది; నోరావులించి కొడుకు ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది చాలా సేపు.

మరి శ్యామల ఫెయి లయినందుకు మాట వరసకయినా ఆ పిల్లనేమీ మందలించలేదు తార. ఓ విధంగా అది ఆమెకి లాభదాయకంగానే కనపడుతుంది.

ఫెయిలయిన వాళ్ళకి ఆ ఊరి హైస్కూల్లో సీటివ్వ రనే నెపంతో ఇంట్లోనే ఉంచి, కొడుకుతో పాటు ఆ పిల్లకీ ట్యూషన్ ఏర్పాటు చేస్తే సరి!

స్కూళ్ళు తెరిచారు. పిల్లలు కిలకిల లాడుతూ స్కూళ్ళకి పోతున్నారు.

తన కున్న పలుకుబడి సుపయోగించి ఫెయిలయి కూర్చున్న కొడుక్కి రెండో సంవత్సరం కూడా అదే స్కూల్లో టెన్తు క్లాసు చదివే ఏర్పాటు చేయగలిగింది తార.

శ్యామల చదువు విషయంలో తనేం చెయబోతున్నదీ నేర్పుగా, బుజ్జగింపుగా బోధ పరిచిం దా పిల్లకి. రోజూ ట్యూషను మాస్టారు ఇంటికే వచ్చి పాఠాలు చక్కగా బోధిస్తాడు. ఏది అర్థం కాకపోయినా అడిగి స్పష్టంగా తెలుసుకునే వీలుంటుంది. రెండేళ్లలోనే మెట్రిక్ కోర్సంతా చదివేయవచ్చు. ఏకాయెకిని మెట్రిక్ పబ్లిక్ పరీక్షలకి కూర్చోవచ్చు. స్కూల్లో చేరి ఒక్కో తరగతీ పాసవుతూ పోతే గాని మరో మూడేళ్ళ తరవాతయినా టెన్తు క్లాసు పూర్తి చెయ్యలేదు శామల. దాని బదులు హాయిగా ఇంటి పట్టునే ఉండి స్వల్ప కాలంలోనే మెట్రిక్కు పాసవడం మంచిది కదా!

తార మాటలు శ్యామల కెంతో నచ్చాయి. ఏపీటా కష్టపడి చదివి పరీక్షలు వ్రాయాల్సిన పనుంత

దు. రాత్రింబవళ్ళు చదివి రా స్తే మట్టుకు పానవు తామనే నమ్మకమేమిటి? ఇలా అయితే మరో రెండేళ్ళలోనే మెట్రికు పూర్తి చెయ్యొచ్చు. ఏమయినా తారమ్మగారంత తెలివిగా ఇంకెవ్వరూ ఆలోచించలేరు.

ఆనందపడిపోయింది శ్యామల!

ట్యూషను మళ్ళీ రాస్తున్నాడు. పాఠాలు బాగానే చెబుతున్నాడు. హోమ్ వర్కుకూడా దండిగా ఇస్తున్నాడు. అయితే, శ్యామలకి ట్యూషన్లో కూర్చున్న ఒకటీ రెండు గంటలు తప్ప మిగిలిన సమయంలో తీరుబ డనేదే ఉండడం లేదు. చెప్పించుకున్న పాఠాలయినా మరోసారి చదువుకునే సమయమే దొరకడం లేదు.

## (11)

జీవితంలో ఎంతోమంది పడుచు పిల్లల్ని చూచిన ర°సకుడు పాపిరెడ్డి. లోకపు తీరు తెలియని ఆడపిల్లలు అతని చమత్కారపు మాటల్లో, అతడు చూపించే రంగు రంగుల ఆశల వలయాల్లో ఇట్టే పడిపోతుంటారు. పడుచు పిల్లలంటే రెడ్డికున్న వల్లమాలిన మోజు వల్ల కొత్త పిట్టల్ని వలలో వేసుకునే సందర్భంలో ఖర్చుకి వెనకాడడు. మామూలుగా అయితే రెడ్డి పట్టి పి°సని గట్టని పేరు, ప్రాణం మీది కొచ్చినా తెగించి ఖర్చు పెట్టడు.

రెడ్డిగారి ఈ ప్రత్యేక కళ గురించి తారకి బాగా తెలుసు. మొరిగే కుక్కకి మాంసం ముక్కలాగా అతని కో పడుచు దాన్ని అప్పగి స్తే తన జోలికి రాకుండా దాని మోజులో పడి ఉంటాడు.

ఎన్నో ఏళ్ళుగా తను రెడ్డిగారికి చేస్తో వస్తున్న సేవల్లో చాలా వాటిని మెల్లమెల్లగా శ్యామల కప్పగిస్తోంది తార.

రెడ్డి ఎప్పుడు ఏది కావాలన్నా అందించడానికి శ్యామల రెడీగా ఉంటున్నది.

అడిగినప్పుడల్లా మంచినీళ్ళు, వేళ ప్రకారం కాఫీలు, టీలు అందిస్తోంది. అతని స్నానానికి నీళ్ళు °సిద్ధం చెయ్యడం దగ్గర్నుంచీ, బీరువాలోంచి ఆయన క్కావల°సిన ఇ[°]స్త్రీ ఉడుపులు తీ°సి ఇవ్వడం వరకూ శ్యామల పనే అవుతోంది. ఇంకా చిన్నా పెద్దా సప్లయి లన్నీ ఆ పిల్లే చూచుకొంటోంది.

అయ్యగారి పనులన్నీ తనే చూచుకుంటున్నందుకు గర్వంగా ఉంది శ్యామలకి. మనస్ఫూర్తిగా, విధేయతగా అయ్యగారికి సేవలు చేస్తూ తారమ్మగారి ఋణం తీర్చుకోవా లనుకుంటోంది.

క్రమంగా రెడ్డిగారికి భోజనం వడ్డించడంకూడా శ్యామల పనే అయింది.

రాత్రి పూట నిద్ర కుపక్రమించే ముందు కాళ్ళు పట్టించుకునే అలవాటుంది రెడ్డికి. సొంత ఇంట్లో అయితే పాలేళ్ళు పడతారు; ఇక్కడ తార పడుతూ ఉండేది. ఇప్పుడు శ్యామలకి పురమాయించబడింది. రెడ్డి నిద్రలోకి జారే వరకూ అలా కాళ్ళు నొక్కుతూనే కూర్చుంటుంది.

తార కాస్త బుజ్జగించి చెబితే ఏ పనయినా చేస్తుంది శ్యామల.

రెడ్డికూడా శ్యామల పనుల్ని ఎంతో మెచ్చుకుంటూ ఉంటాడు. మనవరాలితో హాస్యా లాడుతున్నట్లు ఛలోక్తులు వి°సిరి నవ్విస్తాడు.

ఇదివరకంతా తారమ్మగారే అయ్యగారి పనులన్నీ స్వయంగా చూచుకుంటూ ఉండేది. ఇప్పుడెందుకు చెయ్యడం లేదో, ఎందుకు దూరదూరంగా ఉంటున్నారో శ్యామల కర్థం కాదు. అర్థం చేసుకోగల వయసూ, జ్ఞానమూ రెండూ లేవు శ్యామలకి.

## (12)

తార మును పెన్నడూ వెళ్ళనంత తరచుగా కాంపులు వెళ్ళి వస్తోంది.

నిరంజన్ పగలంతా స్కూల్లో ఉంటాడు.

రెడ్డికి సేవలు చెయ్యడానికి శ్యామల మాట మాటకీ అతని రూము కెళ్ళక తప్పడం లేదు.

మంచినీళ్ళుగాని, కాఫీ కాని అతని కందిస్తున్నప్పుడు శ్యామల వేళ్ళని తడుముతున్నాడు రెడ్డి.

అప్పుడప్పుడూ ఆ పిల్ల పనితనాన్ని పొగుడుతున్నాడు. "ఎంత పనిమంతురాలివే, పిల్లా, ఎంత చలాకీగా చేస్తునావే" అంటూ మెచ్చుకోలుగా శ్యామల బుగ్గలమీద చిటికె వేస్తుంటాడు. స్నానం చే°సి బొట్టూ కాటుక దిద్దుకొని కనపడితే —"ఎంత చక్కని చుక్కవే" అంటూ పొగుడుతున్నాడు.

ఒకసారి—"మీ అమ్మగారికి చూపించకుండా



నువ్వే వాడుకో" అంటూ ఒక మంచి పౌడరు డబ్బా బహూకరించాడు.

టౌను కెళ్ళి వస్తున్నప్పుడల్లా లడ్డూ, స్వీట్లు కొని తెచ్చి రాత్రి బాగా పొద్దుపోయ్యాక ఎవరూ చూడకుండా శ్యామల కిస్తున్నాడు.

ఒకసారి పట్నం నించి వస్తూ రంగుటద్దాలు గాజులు, రాళ్ళు పొదిగిన రోల్డు గోల్డు రింగులు, ఒక నకిలీ ముత్యాల దండ తెచ్చాడు.

"చూడు, తారా! ఆడపిల్ల లందరికి లాగే మన శ్యామల కికూడా నగల మీద ఆశ ఉంటుంది గదా. దాని అచ్చటా ముచ్చటా తీర్చడానికి పాపం దాని కెవరున్నారు మనంగాక? ఇవిగో వీటిని దాన్ని పిలిచి చేతిలో పెట్టు" అన్నాడు రెడ్డి.

రెడ్డి ధోరణిలో వస్తున్న ఈ పరిణామం తారకి ఆనందాన్ని కలిగిస్తోంది.

తనకి తారమ్మగా రిచ్చిన వస్తువు లన్నీ అయ్య గారు ఎంతో శ్రద్ధగా తన కోసం తెచ్చారనే తలంపు శ్యామల ఆనందాని కవధులు లేకుండా చేసింది. తనంటే అమ్మగారి కెక్కువ ప్రేమో, అయ్యగారికే ఎక్కువ ప్రేమో తేల్చుకోలేక పోతున్నదీ శ్యామల.

ఇప్పుడిప్పుడే శ్యామలలో యౌవనం వికసిస్తోంది. అది ఏదేదో వికారాల్ని జేస్తోంది.

పురుష స్పర్శ ఏదో హాయిని, థ్రిల్‌నీ కలిగిస్తోందా పిల్లకి. చనువుగా రెడ్డి ముట్టుకున్నప్పుడల్లా ఒళ్ళంతా ఝల్లుమంటోంది; గుండె వేగం హెచ్చుతోంది; తియ్యని బాధ శరీరమంతా వ్యాపిస్తోంది.

తారకి ఆఫీసు ఇన్‌స్పెక్షన్లతో బొత్తిగా తీరుబడి లేకుండా ఉంది. కలెక్టరు ఇన్‌స్పెక్షనవగానే, మళ్ళీ ఏ ఆర్.డి.ఒ.దో, జిల్లా పరిషత్ సెక్రటరీదో ఇన్‌స్పెక్షన్ తగులుకుంటున్నది. ఒక్కొక్కటీ పూర్తయి, తెరిపిన పడ్డానికి కనీసం నాలు గేసి రోజులు పడుతున్నది.

తారకి సంబంధించినంతవరకు ఉమన్ అండ్ చైల్డు వెల్‌ఫేర్ ప్రోగ్రాములమీద సమగ్రమైన రిపోర్టులు తయారు చేయడం కోసమని రాత్రిళ్ళు పది పదకొండు గంటల వరకూ ఆఫీసులోనే ఉండిపోతున్నది. రిపోర్టుల తయారీలో సహాయ పడ్డానికి శేషగిరికూడా ఆమెతోపాటు కూర్చుంటున్నాడు. ఇన్‌స్పెక్షన్ల పుణ్యం వల్ల ఒకరి సన్నిధిలో మరొకరు ఎక్కువ కాలం గడపడానికి వీలవుతోం దిప్పుడు.

అర్ధరాత్రి దాటిన తరవాత ఇంటికి వచ్చినా రెడ్డి ఇదివరకులా—"ఇంత ఆలస్యంగా వస్తున్నావేమిటి? రాత్రింబవళ్ళు డ్యూటీయేనా?" అంటూ తారని నిలదీయడం మానేశా డిప్పుడు.

రెడ్డి ధోరణిలో వస్తున్న మార్పును జాగ్రత్తగా గమనిస్తోంది తార.

వీలయినంతవరకు తను ఇంటికి దూరంగా ఆఫీసులోనే, కాంపుల్లోనే కాలం గడపడం అవసరమని ఆమె గుర్తించింది. గ్రామాలకు టూర్ వెళ్ళి రెండు మూడు రోజుల పాటు హాల్టు చేసి వస్తున్నది.

తార ఇంట్లో లేని సమయాలను వృధా పోనివ్వ దలచుకోలేదు పాపిరెడ్డి.

శ్యామలకి ఎన్నెన్నో కబుర్లు, కథలు చెప్పి ఆ పిల్లకి తన పట్ల ఉండే భయాన్ని పోగొడుతున్నాడు. మాటల సందర్భంగా చెప్పినట్టుగా తన అంతస్తు, ఆస్తి పాస్తుల వివరాలను తెలియ జెప్పుతున్నాడు.

తన కున్న భూవసతి వందెకరాలకి మించింది.

బోలెడు మామిడి తోటలు, కొబ్బరితోటలు, నిమ్మ, బత్తాయి తోటలు ఉన్నాయి.

ఇవేకాక అనేక ఫాక్టరీలు, పరిశ్రమలు నడిపిస్తున్నాడు తను. వాటి ద్వారా లక్షలకొద్దీ ఆదాయమొస్తుంది.

మంచి తెలివి గల పెద్దమనుషుల్ని సైతం పల్టీ కొట్టించగల రెడ్డిగారి మాటల చాతుర్యం అడపా దడపా అతనిస్తున్న కానుకలు, పసితనం ఇంకా వదలని శ్యామలకి అతని పట్ల గొప్ప అభిమానాన్ని, ఆత్మీయతను పెంచుకునేట్టు చేస్తున్నాయి.


తన మాటలకి శ్యామల రియాక్షన్స్ ఎలా ఉన్నదీ గమనిస్తున్నాడు రెడ్డి. తను చెప్పే ప్రతి మాటనీ, ప్రతి పొగడ్తనీ సంపూర్ణంగా విశ్వసించే దశకు వచ్చింది శామల.

ఒక రోజు శ్యామల భవిష్యత్తును తనే విధంగా మలచ దలుచుకున్నదీ, వీసమంత కష్టమయినా లేకుండా ఆ పిల్ల జీవితాన్ని ఆనందప్రదంగా చేయదలుచుకున్నదీ బహు లాఘవంగా బోధపరిచాడు రెడ్డి.

శ్యామల చదువూ గిదువూ అంటూ రాత్రింబవళ్ళు చదువుతూ కూర్చో వలసిన పని లేదు. ఆ పిల్ల అందమే ఆమె కున్న గొప్ప వరం. తనను నమ్ముకుంటే ఆమెకు చక్కని ఇల్లు కట్టించి



Chhaya/PP/415




అందులో ఉంచుతాడు. బోలెడంత మంది నౌకర్ల్ని, చాకర్లని ఏర్పాటు చేస్తాడు. తారను మించిన వైభవంతో ఆమెను పెంచుతాడు. ఎంత చదివినా, ఏ ఉద్యోగం సంపాదించినా ఇంతకన్నా మంచి బతుకు రాబోదు.

తారాదేవి అనుభవిస్తున్న సౌఖ్యాలు, భోగభాగ్యాలు పట్ల శ్యామలకి మొదటినించీ గొప్ప మోజు. అయితే ఆమెలా దర్జాగా, గొప్పగా బతకడానికి శ్రద్ధగా చదువుకుని, మంచి ఉద్యోగం సంపాదించాలని తలంచుతూ వచ్చింది. మరిప్పుడు రెడ్డిగారు చూపిన మార్గంలో నయితే ఏ బాధలు లేకుండా తన కల నిజం చేసుకోవచ్చు. చదువులు, పరీక్షలతో నానా విధాల సతమతమయి, తగిన ఉద్యోగం సంపాదించాలంటే మరో పదేళ్ళయినా పట్టక తప్పదు. ఆ బెడదంతా పెట్టుకోడం బదులు రెడ్డిగారు చూపే మార్గంలో పోవడం మంచిది కదా!

చిన్నతనం నించీ తన వాళ్ళు అనుకున్న పెద్దలెవరూ శ్యామల్ని అదుపాజ్ఞలో పెంచలేదు. ఇదీ మంచినీ, ఇది చెడనీ వివరించి, మంచిదారిలో నడిపించే వాళ్ళెవరూ లేకపోయారు. ఆమె ఎవరికీ జవాబు చెప్పుకొనే అవసరం లేదు. మరో వైపు యువ్వనోధృతం తికమక పెడుతోంది. స్త్రీ—పురుష సంబంధమంటే ఏమిటో, అందులో ఉండే సుఖమేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం తొందర పెడుతోంది.

రెడ్డి పొగడ్తలకీ, నవ్వించే కబుర్లకీ, ఇచ్చే కానుకలకీ, అన్నింటినీ మించి అతను తన కళ్ళ ముందు నిలుపుతున్న ఆశాసౌధాల తళతళలకీ శ్యామల పూర్తిగా లొంగిపోయింది.

ఆ నాటి నించీ ముక్కు పచ్చలారని శ్యామల ముసలి రెడ్డి కామాగ్నికి సమిధగా మారిపోయింది.

**(13)**

తార మనసు స్థిమితపడింది. హాయిగా, తృప్తిగా ఉంది. తన ఆలోచన అక్షరాలా నెరవేరింది. ఇక మీదట రెడ్డికీ, తనకీ మధ్య ఎలాంటి సంఘర్షణ లుండవు; అసలు తన గొడవ పట్టించుకోడు.

ఇప్పుడు రెడ్డంటే మరింత అభిమానం చూపిస్తోంది తార. పగలూ, రాత్రి అనేది లేకుండా నిత్యం మందు గ్లాసు లందించుతోంది. నంజుకుందుకు కారం జీడిపప్పు, మసాల పకోడా, చికెన్, లివరు వేపుళ్ళు ఓపిగ్గా తయారు చేస్తూ భక్తిగా అందిస్తోంది.

స్వర్గమనేది ఎక్కడో పైలోకాల్లో ఉందంటే నమ్మే స్థితిలో లేడు పాపిరెడ్డి. తను అనుభవిస్తున్న వాటికన్న ఎక్కువా ఆ స్వర్గసుఖాలు! ఈ మనుమలంతా అక్కడికి చేరాలని కోరుకునేది చివరకు రంభా ఊర్వశీలతో వినోదించి తరించడానికేగా? ఆ దేవ వేశ్యలు ఈ శ్యామలంత పడుచుగా, ఇంత బింకంగా ఉంటారా?

హమేషా నిషా! నిషా హమేషా!

'తినుము, తాగుము, సుఖించుము!' ఉమర్ ఖయ్యాం సూక్తిని శ్రద్ధగా, భక్తిగా ఆచరణలో పెడుతున్నాడు రెడ్డి.

తార ఎక్కడుందో, ఎక్కడి కెళ్ళిందో, అసలు ఇంటికి వచ్చిందో, రాలేదో రెడ్డి కేం పట్టదు.

వంటా వార్పుతోపాటు తనకు అన్ని సుఖాల్ని సమకూర్చే శ్యామల ఉంది—అదే చాలు.

తార శేషగిరి సాహచర్యంలో ఇంత కాలంగా తనకి దక్కకుండాపోయిన భోగ విలాసాలన్నీ చవి చూస్తోంది. ఇద్దరూ కలిసి వీలయి నప్పుడల్లా ఏదో ఒక పెద్ద టౌనుకి పోతూ, పాష్ హొటల్లో మకాం చేస్తూ, కమ్మని, ఖరీదయిన విందు లారగిస్తూ జీవనమాధుర్యాన్ని అందినంత వరకూ ఆబగా జుర్రుకుంటున్నారు.

చక్కని ప్రదేశాల్ని, ప్రకృతి దృశ్యాల్ని ఇంతకు క్రితం ఎన్నో సార్లు చూచింది తార. ఆ ప్రదేశాలే ఇప్పుడు శేషగిరితో కలిసి చూస్తున్నప్పుడు సరి కొత్తగా, మున్నెన్నడు కనపడని అందాలలో మురిపిస్తున్నాయి తారను.

శేషగిరితో గడిచే ప్రతి క్షణం అమూల్యం; నిత్య నూతనం!

**(14)**

నిరంజన్‌కి ఇంట్లో పరిస్థితులేం నచ్చడం లేదు.

రాను రాను తల్లి ఇంటి పట్టునుండే కాలం తరిగిపోతోంది. అర్జంటు పనులంటూ మాటి మాటికీ జిల్లా హెడ్‌క్వార్టర్సుకి పరిగెడుతోంది. ఎప్పుడూ లేనిది గ్రామాలకి టూరు వెళ్ళి అక్కడే వరసగా రెండు మూడు నైటు హాల్టులు చేసి వస్తోంది. రోజుల తరబడి తల్లి ఇంట్లో కనబడక పోవడంతో నిరంజన్‌కి దిగులుగా, బెంగగా ఉంటున్నది.

ఒక్కగానొక్క కొడుకని తార, రెడ్డీకూడా వాణ్ణి మరీ ముద్దు చేశారు. ఆడింది ఆటగా, పాడింది పాటగా పెంచారు. దాంతో వాడు పెంకిగా, దురుసుగా, మూర్ఖంగా తయారయ్యాడు.

ముఖ్యంగా తార వాణ్ణి పెంచిన తీరు వాణ్ణి అహంకారిగా మార్చింది. తను, తన కొడుకు ఎంతో పై అంతస్తుకు చెందిన వాళ్ళని జనం గ్రహించాలని తార తాపత్రయం.

"మా వాడు లక్షల ఆస్తికి వారసుడని మా ముట్టా లందరికి తెలిసి పోయింది. ఇప్పటికిపుడు రెండు లక్షల కట్నంతో పిల్లల నిస్తామని పోటీలు పడి వస్తున్నారు. వీడి పెళ్ళి కోసం ఇప్పట్నించే తొందర పడాల్సిన అవసరమేవిటి మాకు? చదువు పూర్తయ్యే వరకూ పెళ్ళి ఆలోచన లేదని అందరికీ చెప్పి పంపడానికి నిజంగా మా ప్రాణాలు పోతున్నా యనుకోండి!" గొప్పలన్నీ కొడుకు ముఖం ముందే చాటుకొంటుంది.


ఈ ధోరణిలో నడిచే తల్లి మాటలు విని విని నిరంజన్ పెద్ద వాడవుతున్న కొద్దీ లక్షలకి అధిపతినసే గర్వాన్ని పెంచుకుంటున్నాడు. చదువుమీద కన్నా పొలాలమీద, పంటలమీద, ఏటేటా తమ కొచ్చే ఆదాయంమీద శ్రద్ధ ఎక్కువవుతోంది అతనికి. ఆదాయపు వివరాలు, లెఖ్ఖలు తెలియగానే ఖర్చుల వివరాలు తెలుసుకోవాలనే ఆసక్తి పెరుగుతోంది. క్రమంగా తల్లి పెడుతున్న ఖర్చులమీద ఒక విధమైన నిఘా వెయ్యడం మొదలయింది.

చుట్టాలు, అతిథులు వచ్చిన సందర్భాల్లో తార తన అంతస్తుకి తగినట్టుగా ఆడంబరంగా ఖర్చు పెట్టి విందు భోజనాలు పెట్టకపోతే బాగుండదు. అలా చెయ్యడం నిరంజన్‌కి సుతరామూ గిట్టదు. ఆవిడ పెడుతున్న ఖర్చుల్ని గురించి అతిథుల ముందే నిగ్గదీసి అడుగుతుంటాడు. ఎందుకింత ఖర్చు పెట్టాలి అంటూ జగడం పెట్టుకుంటాడు.


కొన్నాళ్ళనించీ తార సరిగా ఇంటి పట్టున ఉండకపోవడం వల్ల ఇంటిని నడిపే బాధ్యత దానంతటదిగా శ్యామల మీద పడింది. అన్నీ అమర్చి పెడుతున్న శ్యామ లుండగా తార లేని లోపం ఏమంత తెలియడం లేదు రెడ్డికి. ప్రతి క్షణం శ్యామల వెనక వెనకనే తిరుగుతూ ప్రతి చిన్న దానికీ ఆమె మీద ఆధార పడుతున్నాడు. తనకి తెలియకుండానే ఇంటి వ్యవహారాలంతా చక్క దిద్దుతున్న శ్యామలలో ఒక విధమైన ఆత్మవిశ్వాసం, ధీమా పెరిగాయి.

నిరంజన్ పరిస్థితి అయోమయంగా తయారయింది. తల్లి దూరదూరంగా జరిగి పోతుంటే తండ్రికి తన ధ్యాసే లేకపోతున్నది. తనకి ఊహ తెలిసినప్పటినించీ, తండ్రి తన పట్ల ఇంత నిరాదరణ ఎన్నడూ చూపి ఎరగడు. తను ఏది కోరినా క్షణాలమీద తెచ్చి ఇచ్చేవాడు. ఎంత విసిగించినప్పటికీ కళ్ళెర్ర జేసి చూచైనా ఎరగడు. ఇప్పు డసలు తన గొడవే పట్టించుకోవడం లేదు. ఆ శ్యామల్నయితే అతి ముద్దుగా, అస్తారు పదంగా చూస్తున్నాడు. అసలు అది ఎందుకుండాలి తమ ఇంట్లో? తెగ తిని బలిసి పోవడానికా?

## డుంబు




## బుజ్జాయి




నాన్నకి ఏవేవో సేవలు చేస్తూ ఆయన్ని బాగా లోబరచుకుంది. తనకన్నా ఇప్పుడదే ఎక్కువయింది నాన్నకి. అమ్మో! ఎంతకయినా తగిందది!

దాదాపు ప్రతి రోజూ శ్యామల విషయంలో తారతో తగాదా పడుతున్నాడు నిరంజన్. "ఇది మనింట్లో వద్దు: మళ్ళీ ఆ హోమ్‌కే పొమ్మను." రోజూ ఒకటే పోరు.

కొడుకు మాటల్ని లక్ష్యపెట్టడం లేదు తార. శ్యామల లేకుండా ఇంట్లో క్షణం గడవదు. ఇంటెడు చాకిరీ చేస్తున్నందుకు ఓ ముద్ద పడేస్తున్నారు. అందువల్ల తమకి తరిగేదేం లేదు. నెలకి రెండొందలిస్తే మటుకు శ్యామలకి మల్లే సొంత మనిషిలాగు ఇల్లు కనిపెట్టుకుని ఉండేవాళ్ళు ఎక్కడ దొరుకుతారు? ఎందుకదంటే అంత ద్వేషం? తార శత విధాల నచ్చజెపుతోంది కొడుక్కి.

దీనివల్ల నిరంజన్‌లో మార్పు రాకపోగా మరింత రెచ్చిపోతున్నాడు. తల్లీ తండ్రీ ఇద్దరికీ తన మీద ఆపేక్ష తగ్గిపోతున్నదనే భయం పట్టుకుంది. దీనికంతటికీ కారణం ఆ శ్యామలేనని నిర్ధారించుకున్నాడు. దాంతో ఆ పిల్ల కంటబడితే చాలు భగ్గుమని మండి పడుతున్నాడు.

శ్యామల కూడా మారింది. ఇదివరకులా నిరంజన్‌కి భయపడటం లేదా పిల్ల. వచ్చిన కొత్తలో అతని పెత్తనాన్ని పూర్తిగా ఆమోదించింది. కసిరినా, కేకలేసినా నవ్వుతూ బదులు చెప్పేది.

ఇప్పుడందుకు పూర్తి భిన్నంగా మారింది. నిరంజన్ అడ్డగోలుగా మాట్లాడితే విదిలించి కొడుతోంది. మాటకి రెండు మాటలంటిస్తోంది. ఇహ కక్ష పట్టలేని స్థితిలో బూతుల ప్రయోగంలోకి దిగుతాడు వాడు. పరిస్థితి శ్రుతి మించిపోతూ, అసహ్యంగా తయారవుతున్న తరుణంలో నాలుగు బాది కొడుకుని లొంగ దీసుకుంటుంది తార. మరోవంక పెద్ద పెద్ద కేకలు, రంకెలు వేసి నిరంజన్‌ని అదుపులో పెడుతుంటాడు రెడ్డి.

నిరంజన్ చీటికీ మాటికీ పెట్టుకునే చిలిపి కజ్జాల వల్ల, అర్థం పర్థం లేని పేచీల వల్ల కేకలు బొబ్బలతో గృహ వాతావరణమంతా నిండిపోయి ఉంటున్నది. ప్రతి ఒక్కరికీ శాంతి దూరమయింది.

చివర కొక రోజున నిరంజన్ తల్లికీ తండ్రికీ తెగవేసి చెప్పాడు- "ఆ దిక్కుమాలిన శ్యామల ముండ మనింట్లో ఉండడానికి వీల్లేదు. అది ఉన్న ఇంట్లో నేనుండను. మీరు దాన్ని ఒదలలేమంటే మరిక నన్ను ఒదులుకోవాలి; ఎక్కడికో ఒక చోటికి పారిపోతాను. ఇంట్లో అదయినా ఉండాలి, నేనయినా ఉండాలి... మరి మీ ఇష్టం."

రెడ్డికి మతి పోయింది. తారకి ఎటూ పాలు పోకుండా ఉంది. నిరంజన్ తిట్టినప్పుడల్లా, అవమానించినప్పుడల్లా శ్యామల రెడ్డిని సమీపించి భోరుమని ఏడుస్తోంది. ఆ పిల్ల ఏడుపు చూడలేకపోతున్నాడు. కొడుకుని దండించి, భయపెడదామా అంటే వాడెటు పోతాడోనని భయం.

ఆలోచించాడు రెడ్డి. శ్యామల్ని ఈ ఇంటినించి తప్పించి మరెక్కడయినా ఉంచడం శ్రేయస్కరం. అంతకు మినహా మరో తరుణోపాయం లేదు.

## (15)

రాజమండ్రినించి కోరుకొండకి పోయే బస్సు రూటు వక్కగా పట్టణానికి సమీపంలోనే రెడ్డికి చెందిన ఒక ఖండసారీ మిల్లు ఉంది. రెడ్డీ, మరో చౌదరీ ఇద్దరే అందులో పార్ట్‌నర్లు.

మిల్లు ఆవరణ సువిశాలంగా ఉంది. దాన్లోపల ఆధునిక సౌకర్యాలన్నీ ఉన్న గెస్టుహౌసుంది. టాక్సు ఎసెస్మెంటు కోసం వచ్చే ఇన్‌కంటాక్సు ఆఫీసర్లు, ప్రొడక్షను క్వాలిటీని తనిఖీ చేసేందుకొచ్చే ఎక్సయిజు అధికార్లు, మిగిలిన రకరకాల అతిథులు విడిది చెయ్యడానికి వీలుగా ఆ గెస్టు హౌస్ నిర్మించబడింది.

అధికార్లున్నంతకాలం ఘనమైన మర్యాదలు, సత్కారాలు జరుపబడుతుంటాయి. పార్ట్‌నర్లిద్దరూ కలిసి భారీ ఎత్తున డిన్నరు పార్టీలు, కాక్టైలు పార్టీలు ఏర్పాటు చేస్తూ అధికారుల మెప్పుల్ని, ఆదరాన్ని పొందుతూ ఉంటారు.

ఆ రోజు తార ఇంట్లో లేదు. తిరిగి వచ్చేసరికి రెండ్రోజులు పడుతుందని, దూరపు గ్రామాలకి టూరు వెళ్ళింది. నిరంజన్ తన క్లాసు మేట్సుతో కలిసి ఆటల పోటీల్లో పాల్గొనడానికి పక్క టవును కెళ్ళాడు. మర్నాడు రాత్రికి గాని వాడు ఇల్లు చేరుకోడు.

ఇరుగు పొరుగుల వాళ్ళు నిద్రపోయి, ఊరు మాటు మణిగాక కార్లో శ్యామల్ని కూర్చో బెట్టుకుని రాజమండ్రి దిశగా బయలుదేరాడు పాపిరెడ్డి. తెల్లవారు ఝాముకి ఖండసారీ ఫాక్టరీ గెస్టు హౌసుకి చేరింది కారు. పదిహేను రోజులపాటు అక్కడ శ్యామలా, తనూ కలిసి ఉండేందుకు ముందుగానే ఏర్పాట్లు జరిగాయి.

గెస్టు హౌస్‌లోకి అడుగు బెట్టిన శ్యామలకి అదొక ఇంద్రలోకంలా తోచింది. చుట్టూ దట్టంగా పచ్చని ప్రకృతి అలుముకుని ఉంది. శ్యామల ఎప్పుడూ చూచి ఎరగని అడవి మానులు, పొదలు, తుప్పలు, ఒక దానితో మరొకటి అల్లిబిల్లిగా అల్లుకుంటూ చెట్ల మీది కెగబాకుతున్న తీగలు, లతలు, రంగు రంగుల పూలతో తనకు స్వాగతం పలుకుతున్నట్లున్నాయి.

ఫాక్టరీ వక్కనించే గోదావరి పరుగులు తీస్తూంది. కిటికీల్లోంచి చూస్తోంటే కంటి కందినంత వరకూ అంతా నీటిమయంగా కనబడుతోంది.

ప్రతి పూట రాజమండ్రిలోని హోటల్‌నించి రుచికరమయిన ఫలహారాలు, భోజనాలు వస్తున్నాయి.

గెస్టు హౌస్ నౌకర్లు అడుగులకు మడుగులొత్తుతున్నారు. చెయ్యడాని కేం పని లేదు. అంతా తీరికే!

తినడం, నిద్ర పోవడం, రెడ్డిగారికి సుఖాన్నందించడం... శ్యామలకి మరో ధ్యాసే లేదు.

సాయం సమయాల్లో ఇద్దరూ కార్లో గోదావరి ఒడ్డుకు షికారెళ్ళి వస్తున్నారు. గట్టుమీద నించి చూస్తే ఎదురుగా కొవ్వూరు. దాని కాస్త పైన ఉత్తర దిశగా పట్టిసీమ తీర్థపు రేఖలు కనిపిస్తున్నాయి. రేవు కెదురుగా రెండు మూడొందల గజాల దూరంలో గోదారి నట్టనడుమగా పెద్ద లంకదిబ్బ- దానిమీద ఎన్నో వందల ఏళ్ళనాటి పురాతన దేవాలయాలు రమణీయంగా దర్శన మిస్తున్నాయి.

ఆ ప్రకృతి, ఆ అనంత జలరాశి, అస్తమిస్తున్న రవి కిరణాల జడివానలో మెరిసిపోతున్న గోపుర శిఖరాలు- ఓహ్! అవన్నీ ఏ దేవలోకానికి చెందినవో నన్నట్టు అనిపిస్తున్నాయి శ్యామలకి.

ఇంత అందం, ఇంత వైభవం మరీ భరించలేనిదిగా ఉంది పేదరికంలోనే పుట్టి పెరిగిన శ్యామలకి.

తార నివసిస్తున్న ఊరికి ఓ అరమైలు దూరంలో దాని శివారు గ్రామ మొకటుంది. అక్కడ త్వరలోనే శ్యామల కోసం ఓ మంచి ఇల్లు కొని అందులో ప్రవేశ పెడతానన్నాడు రెడ్డి. అంతేకాని, తిరిగి తారాదేవి ఇంటి గుమ్మం ఎక్కవలసిన పని లేదని ధైర్యం చెప్పాడు. అంతేకాక పదెకరాల పొలం కూడా రాసిస్తానన్నాడు.

శ్యామల మనస్సరోవరంలో రంగు రంగుల అలలు! మనోనేత్రం ముందు రంగు రంగుల కలలు!

(సశేషం)

## (క్రిందటి సంచిక తరువాయి)

**మూడోనాటి** సాయంత్రం ఐదవుతుండగ తార కాంపు నించి తిరిగి వచ్చింది. గుమ్మంలో బిక్కు బిక్కుమంటూ. ముఖంలో ఏ భావమూ లేకుండా నిరంజన్ కూర్చుని ఉన్నాడు. ఇల్లంతా బావురుమంటూ ఉంది.

జరిగిపోయిన ఉదంతం గురించి కొడుకు వివరించాడు.

దిమ్మెరపోయింది తార. రెడ్డి శ్యామల్ని అలా వెంట దీసుకుని వేరే ఎక్కడికయినా వెడతాడని కాని. మకాం బెడతాడని కాని తార కలనైనా అనుకోలేదు.

పకడ్బందీగా ప్లాన్ చేసుకుని. లాభ నష్టాలని ఖచ్చితంగా బేరీజు వేసుకు నడిపితే నేం? ఒక్కొక్కప్పుడు హఠాత్తుగా దివాలా దీయిస్తుంటాయి కొన్ని వ్యవహారాలు.

ఈ వ్యవహారంతో తారాదేవి కుదేలయింది. తన పథకం ఈ మోస్తరైన మలుపు తిరుగుతుందని ఆమె అనుకోలేదు. కొండ నాలికకు **మందు** పెడితే ఉండే నాలిక ఊడిపోయిం దన్నట్టుగా అయింది పరిస్థితి

ఏదో ఏ దిక్కూ లేని ఆ పిల్లతో ఇంట్లోనే గుట్టుగా కాలక్షేపం చేస్తాడనుకుంది; ఇలా బరితెగించి ఊరేగుతా డనుకోలేదు.

తారకి ఇప్పుడు మరో భయం పట్టుకుంది. తనతో పూర్తిగా తెగతెంపులు చేసుకుని ఆ పనికిమాలిందాన్తోనే ఉండిపోతాడేమో! తమ ఇద్దరి పేరా ఎన్నో బాంకుల్లో జాయింటు ఖాతా లున్నాయి. తను ఒక్కతీ ఏ అకౌంటునూ ఆపరేట్ చెయ్యడానికి వీల్లేదు. దొంగలకి జడిసి పెద్ద పెద్ద నగలన్నిటినీ లాకర్సులో పెట్టి ఉంచారు. వాటిని బయటికి తెచ్చుకోవాలన్నా. రెడ్డిగారి సంతకం లేందే కుదరదు.

ఛ! పరిస్థితులు ఇట్లా వక్రిస్తాయని అనుకోలేదు. ఒకటి అవుతుందని తలిస్తే మరొకటయి కూర్చుంది. ఇప్పుడేమిటి చెయ్యడం? తక్షణమే రెడ్డి ఎక్కడున్నాడో వెదికి పట్టుకు రావాలి. పాతాళంలోఉన్నా. గాలించి పట్టుకు రావాలి.

రెడ్డి మామూలుగా మకాము లుండే చోట్లన్నిటికీ మనుషుల్ని పంపింది తార. ఆచూకీ తెలుసుకునేందుకు సర్వ ప్రయత్నాలు చేసింది.

ఎక్కువ రోజులు శ్రమ పడకుండానే తారకి రెడ్డి ఆచూకీ తెలిసిపోయింది. రాజమండ్రిలో ఖండసారి షుగరు ఫాక్టరీ గెస్టు హవుస్‌లో శ్యామలా సమేతుడై రెడ్డి విడిది చేసియున్నట్లుగా కబురందింది.

తార గుండెలు క్షణంపాటు భగ్గుమన్నాయి. ఇదివరకు తనూ. రెడ్డీ కలిసి అదే గెస్టు హౌస్‌లో అత్యంత వైభవంగా గడిపిన రోజులు మనసులో మెదిలి ముళ్ళలా హృదయాన్ని గుచ్చేయి.

సమితి ఆఫీసులో ప్రతి ఒక్కరికీ రెడ్డిగారి ప్రేమ యాత్ర గురించి తెలిసిపోయింది. ఆఫీసులో ఎవరి ముఖమూ చూడలేకపోతున్నది తార. సెలవు కాగితం పంపి ఇంట్లోనే ఉంటున్నది.

తారా-శేషగిరులకు ఆఫీసు స్టాఫ్‌లో వందిమాగధ గణంతోబాటు వైర గణంకూడ చెప్పుకో తగ్గ సంఖ్యలోనే ఉంది. తారాదేవి ఇంటి గుట్టు రట్టయి పోయినందుకు బ్రహ్మానంద పడిపోతున్నారు వాళ్ళు.

పూట పూటకీ శేషగిరి వచ్చి తారకి ధైర్య వచనాలు చెప్పి. ఓదార్చుతున్నాడు.

ఈ సమయంలో ఇద్దరి మనఃస్థితీ చిత్రమయిన రీతిగా కొట్టు మిట్టాడుతోంది.

ఒక పక్క రెడ్డి పీడ వదిలినందుకు సంతోషం. మరో పక్క అతన్తో ముడి పడి ఉన్న అనేక వ్యవహారాల పరిష్కారాన్ని గురించిన బెంగ! ఈ అనిశ్చిత పరిస్థితి నించి క్షేమంగా ఎలా బయటపడదామా అని రకరకాల మార్గాల్ని వెదకసాగారు.

*** ***

## (17)

"నిరంజన్ సీరియస్ స్టార్ట్ ఇమీడియట్లీ!"


టెలిగ్రాముని చదువుతుంతగానే పాపిరెడ్డికి కాళ్ళూ చేతుల్లో వణుకు పట్టుకుంది. తారకీ.



పెద్ద కథ

# మాకు రావు సూర్యోదయాలు

నంబూరి పరిపూర్ణ



అతనికీ మధ్య ఎన్ని గొడవ లున్నా పిల్లవాడి మీద మాత్రం అతనికి ఎనలేని అపేక్ష. వాడి క్కాస్త జ్వర మొచ్చి రెండు మూడు రోజులు పడక వేశాడంటే కాలు గాలిన పిల్లిలా ఇల్లంతా కలియ తిరిగి నిమిషాలమీద డాక్టర్ని పిలుచుకొచ్చి చూపించేవాడు. ఒంట్లో ఏ బాధ ఉన్నా వాడు తల్లిని వదలి తండ్రితోనే చెప్పుకుంటుండే వాడు.

తండ్రి పట్టుమని పది రోజులు కనబడకపోతే పుట్టెడు బెంగ నిరంజన్ కి.

"ఇప్పుడే °స్థితిలో ఉన్నాడో. ఎంతగా కలవరి స్తున్నాడో తనని!" ద్రవించి పోయాడు రెడ్డి.

మరొక్క నిమిషం కూడా ఆగకుండా శ్యామల్ని వెంట బెట్టుకుని ఆఘ మేఘాలమీద కారులో బయలు దేరాడు.

తారాదేవి ఇంటికి మూడు మైళ్ళ దూరంలో రెడ్డిగారి కొక కొబ్బరి తోట ఉంది. తోట కానుకుని ఆయన తారకి రా°నచ్చిన పదెకరాల పొలం ఉంది. తోట చుట్టూ పకడ్బందీగా కంచె. దాని కొక గేటు ఉన్నాయి.

రెడ్డిగారి కారు తిన్నగా గేటు ముందు కొచ్చి ఆగింది. తోటలో గేటుకి చేరువలోనే చిన్న కుటీర మూ. అందులో తగినంత ఫర్నిచరూ. ఓ మంచ మూ. పరుపూ ఉన్నాయి. పొలం పనులు దగ్గిరుండి చేయించ వల°నన సమయాల్లో కొన్ని రోజులపాటు కుటీరంలోనే ఉండిపోతాడు రెడ్డి. శ్యామల్ని కుటీరంలో దించే°న హడావుడిగా తార ఇంటికి కారును పోనిచ్చాడు.

ఊళ్ళో వైరల్ జ్వరాలు ముమ్మరంగా ఉన్నాయి. నిరంజన్‌కీ అలాంటి జ్వరమే వచ్చింది. రెండ్రోజు లుండి తగ్గిపోయింది.

రెండ్రోజుల జ్వరమే అయినా చాలా తీవ్రంగా రావడంవల్ల బాగా చిక్కిపోయాడు నిరంజన్. జ్వరం వదిలింది కాని. దగ్గు పట్టుకుంది. దగ్గు తెర వచ్చినప్పుడు ఊపి రాడనివ్వదు.

రెడ్డిగార్ని చూడగానే తారాదేవి దుఃఖోద్వేగంతో ఊగిపోతూ. రెండు కాళ్ళూ వాటేసుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. రెడ్డి ఎంతగా వారించినా. పట్టుకు న్న కాళ్ళు వదల్లేదు.

తార దుఃఖం. ఆమె దెప్పుళ్ళు. బేలతనం రెడ్డిగారిని కదిలించి వేశాయ్. "ఇప్పు డేమ యిందని అంతలా ఏడుస్తావ్? కొంప లేవ్ కూలి పోయినట్లు ఎందు కా ఏడుపు? ఊరుకో ఇహ." తార తల నిమురుతూ ఓదార్చాడు రెడ్డి.

"నా ఏడుపంతా మన కొంప కూలగూడ దనే నండీ! నా కన్యాయం చెయ్యనని మాటివ్వండి. బాబునీ. నన్నూ వదిలి ఇంకెప్పుడూ ఎక్కడికీ వెళ్ళనని చెప్పండి."

"అలాగే లే. ఇక చాలించు ఆ శోకాలు. వెర్రి మొర్రి ఆలోచనలేం వద్దు గాని. బాబుగాడికి పథ్యం పానం జాగ్రత్తగా చూడు. అవసరమయితే పది రోజులు సెలవు పెట్టు..." చాచి ఉంచిన తార చేతిలో తన చేతి నుంచుతూ బెట్టుతో గూడిన ప్రేమతో అన్నాడు రెడ్డి.

**(18)**

తోట చుట్టూ వేరుశనగ పొలా లున్నాయి. వేరుశనగ తీతలు కోసం వచ్చిన ఆడకూలీలు. తోట పనిలో ఉన్న పాలేళ్ళు శ్యామల చుట్టూ మూ గారు. తలా ఒక ప్రశ్న వేస్తున్నారు. ఏం చెప్పడానికీ తోచడం లేదు శ్యామలకి. ఊరికే గుడ్లప్పగించి చూస్తూ కూర్చుంది.

వాళ్ళందరూ రెడ్డిగారి శృంగార లీలలు తెలిసి ఉన్న వాళ్ళు. చాలా సేపు ఏవేవో ఎగతాళి మాటలంటూ. శ్యామల్ని కవ్వించి ఆనందించాలని చూచారు కాని. ఎంత ప్రయ త్నించినా శ్యామల పెదవి విప్పలేదు.

ఒంటి గంట వేళకి రెడ్డిగారు స్కూటరుమీద వచ్చి తోటగేటు ముందాగారు. దొరగార్ని చూడగా నే పాలేళ్ళు పరిగెట్టి వచ్చి గేటు బార్లా తెరిచారు. దొరగారు సంజ్ఞ చెయ్యడంతో స్కూటరు బా స్కె టులోంచి భోజనం కారియరు తీసి కుటీరం లోకి పట్టుకొచ్చాడు ఒక పాలేరు.

ఓ మూ లగా కుర్చీమీద నిస్సత్తువగా కూలబడి కూర్చుని ఉంది శ్యామల. ముఖం కళ దప్పి. బేలగా చూస్తూంది శూన్యంలోకి. తనని ఈ తోటలోకి తెచ్చి ఉంచా రేమిటి? ఈ జనం తనని ఇలా విచిత్రంగా చూస్తూంటే ప్రాణం చచ్చిపోతున్నది గదా తనకి!

"ఏం మాటాడకుండా ఏమిటే. శ్యామలా. అలా చూస్తున్నావ్? ముం దా అన్నం తిను."

శ్యామల మౌనంగా లేచి భోజనం ముందు కూర్చుంది. ఎందుకనో. నోటిలోకి ముద్ద పోవడం లేదు. అలాగే తిన్నా ననిపించి. కారియరు గిన్నె లు సర్దేసి. రెడ్డిగారు పడ్డగిలిన మంచం పక్కకి కుర్చీ లాక్కుని కూర్చుంది.

ఓ పది నిమిషాలు అలా మౌనంగా గడిచాక సంకోచ పడుతూనే సంభాషణ కుపక్రమించింది శ్యామల.

"నా కోసం ఇల్లేమయినా చూస్తారా. అయ్యగా రూ? సాయంత్రంలోగా ఏదయినా దొరుకు తుందా?"

"ఆ... అదే... కోటిగాణ్ణి ఆ పనిమీదే పంపా! అయినా. ఇప్పటి కిప్పుడు దొరకడం కష్టమే."

"అయ్యో! మరి దొరక్కపోతే ఎలా. సార్! నే నెక్కడుంటాను మరి?"

"ఎక్కడో ఎందుకు? ఇక్కడే ఉంటావు. తోడుగా కోటిగాడి తల్లి వచ్చి పడుకుంటుందిలే- మరేం భయముండదు."

"బాబోయ్! ఇక్కడే ఉండాలా నేను? ఈ ఎర గని చోట. ఒక్కదాన్నీ ఈ తోటలో గడపమంటారా! రాత్రి పూట భయమేస్తుంది. సార్!"

"ఏం చెయ్యమంటావు మరి... ఇల్లు దొరికేదాకా ను వ్విక్కడ గడపక తప్పదు. ఇవ్వాళ కాకపోతే రెండు మూ డు రోజుల కయినా ఇల్లు దొర క్కుండా ఉండదు. అంతవరకూ వనవాసం తప్ప దు రాణిగారికి!" శ్యామల్ని పక్కలో కూర్చో బెట్టు కుని. వీపు నిమురుతూ ధైర్యం చెప్పాడు రెడ్డి.

మర్నాడుకూడా భోజనంతోపాటు రెడ్డి వచ్చాడు. ఓ గంట సేపు కూర్చుని శ్యామలకి ఈ కబురు. ఆ కబురూ చెప్పి వెళ్ళిపోయాడు.

మూ డో రోజునించీ పాలేరుతో భోజనం పంపబ డుతున్నది. తారమ్మగారింటి నించే భోజనం వస్తోం ది.

ఆర్రోజులు గడిచాయి.

రెడ్డిగారు రావడం లేదు.

ఏమయిం దాయనకి? ఎందుకని రావడం లేదు? రెడ్డిగారి కోసం అనుక్షణం ఎదురు చూస్తో




కూర్చుంటున్నది శ్యామల. ఆమె సంపూర్ణంగా నమ్మిన ఒకే ఒక దిక్కు రెడ్డి? చిల్డ్రన్స్ హోముతో తనకి ఋణం తీరిపోయింది. ఇప్పుడు తారమ్మగారింటి తలుపులుకూడా మూసుకుపోయాయి. ఇదంతా అయ్యగారికి తెలియదా! తన కెందుకో చాలా భయంగా ఉంది. ఎంత కాల మిలా తనని ఒంటరిగా ఉంచుతారు?

ఇల్లింకా దొరకలేదేమో! అదే అయ్యుండచ్చు. అయితే, ఆయ నెందుకు రావడం లేదు? ఒక్కసారి ఆయనొచ్చి సంగతేమిటో తెలియబరుస్తే తన కెంత ధైర్యంగా ఉంటుంది?

అబ్బ! ఎంత గుబులుగా, ఎంత బెంగగా ఉంటోంది తనకి! తోటలో కొచ్చింది మొదలు ప్రతీ రాత్రీ పీడకలలే వస్తున్నాయి. పగలు మేలుకుని ఉన్నంత సేపూ పిచ్చి పిచ్చి ఆలోచనలతో తల పగిలి పోతున్నది; దేనిమీదా మనసు నిలవదు. రాత్రుళ్ళు పీడకలలు!

అసలే నేను పుట్టెడు బెంగతో కుంగిపోతుంటే ఈ కూలి కొచ్చిన ఆడవాళ్ళేమిటి-అలా కిటికీ లోంచి తొంగి తొంగి చూస్తూ ఏమిటేమిటో గుసగుసగా చెప్పుకుంటున్నారు? ఇంకెన్నాళ్ళు గడపాలో తనిక్కడ అబ్బ!

మరునటి మధ్యాహ్నానికి రెడ్డి దర్శన మిచ్చాడు. అతణ్ణి చూస్తూనే బిగ్గరగా ఏడ్చేసింది శ్యామల. ఏడుస్తూనే ప్రశ్నమీద ప్రశ్న వెయ్యసాగింది. "ఇన్ని రోజులు ఏమయిపోయినా రయ్యగారూ? ఎందుకని నన్ను చూడ్డానికి రాలేదు? ఏమయింది ఇంటి సంగతి? దొరికిందా?"

రెడ్డి తాపీగా సిగరెట్టు ముట్టించి ఎటో చూస్తూ గుప్పు గుప్పున పొగ వదులుతున్నాడు.

"అబ్బ ఎంత భయ మేసిం దనుకున్నారు ఈ ఆర్రోజుల్నించి నాకు! ఇల్లు దొరికిం దను కుంటా. తీసి కెళ్తారా న న్నివ్వాళ?"

"ఇల్లింకా కుదర్లేదే, అమ్మాయ్!" శ్యామల వైపు చూడకుండానే అన్నాడు రెడ్డి.

"ఏమిటండయ్యగారూ! ఇంకా కుదర్లేదా? అసలు మీరు గట్టిగా వెదికిస్తున్నట్టు లేదు. లేకపోతే ఇదో లెక్కలో పనా మీకు?"


"నిజమే ననుకో. గట్టిగా తిరిగి ఇల్లు చూడ్డానికి ఇప్పుడు పాలేళ్ళవళ్ళకీ తీరుబాటు లేదు. ఊడ్పుల అదు నిది, నారు తీతలు, వరిమళ్ళు దమ్ము చేసుకోవటం, కూలివాళ్ళని కేకేసుకు రావటం...అబ్బో ఒక్క పని కాదు వాళ్ళకి; ఊపిరి తిరగని పనులు."

"సరే ననుకోండి. మరి...ఇంకా ఎన్నాళ్ళుండమంటారు న న్నీ అడవిలో?" ఉబికి వస్తున్న ఉక్రోషంతో అంది శ్యామల.

"ఏమిటన్నావ్ ఇదీ అడివా? ఇంత అందమయిన తోట నీకు అడవిలాగా ఉందన్నమాట. అసలిక్కడ నీ కొచ్చిన ఇబ్బందేమిటి? తోడుగా మునల్దుంది. స్నాన పానాలకి పాలేరు నీళ్ళు తెచ్చి పెడుతున్నాడు. వేళకి భోజన మొస్తున్నది. కమ్మగా తిని పడుకోక. ఎందుకు ఊరికే గొడవ పెడతావు?"

"ఊరికే తింటూ. ఈ చెట్టూ చేమల్ని తెల్లవారి లేచింది లగాయతు రాత్రి చీకటి పడేవరకూ చూస్తూ కూర్చోవటమేనా, సార్, నా పని? ఊరి ముఖం చూడకుండా ఎన్నాళ్ళిలా తిని పడుండమంటారు?"

శ్యామల మాటలు అసలు తనకి వినబడనట్లే




ఎటో చూస్తూ పరధ్యానంలో పడిపోయాడు రెడ్డి.

"ఏంటయ్యగారూ! ఏం మాట్లాడరేమిటి? నేను మాత్రం ఇంకొక్క రోజుకూడా ఇక్కడుండేది లేదు. ఆ. ఇదే చెప్పడం మీకు."

శ్యామల బెదిరింపుతో స్పృహలో కొచ్చిన రెడ్డి ఆ పిల్ల ముఖంలోకి ఈసడింపుగా చూస్తూ, "ఊరు ముఖం చూడాలని నీ కైతే ఉబలాటంగా ఉండచ్చు; నీ ముఖం చూడ్డానికి ఊరు ఇష్టపడవద్దూ" అన్నారు రెడ్డి.

వీపుమీద ఎవరో చాచి పట్టి ఛెళ్ళున చరిచినట్లయింది శ్యామలకి. రెడ్డి మాటల్లో హఠాత్తుగా వచ్చిన మార్పుకి ఆశ్చర్యంతో బిగుసుకు పోయిం దా పిల్ల.

రెడ్డి శ్యామల వైపు కన్నెత్తయినా చూడకుండా అలాగే సిగరెట్టుమీద సిగరెట్టు ముట్టించి దమ్ము లాగుతూ, పక్కనే ఉన్న పడక కుర్చీలో కూలబడి కళ్ళు సగం మూసుకున్నాడు.

శ్యామల మనసులో ఏదో అనుమానం మెల్లగా చోటు చేసుకోసాగింది. ఆమెకి రెడ్డిమీద ఏర్పడిన దృఢమైన విశ్వాసం ఇప్పుడు నిమిష నిమిషానికి సడలిపోతూ ఉంది.

ఇద్దరి మధ్య ఇంకేం మాటలు సాగలేదు. నిశ్శబ్దం భయం కరంగా, భరించలేనిదిగా ఉంది శ్యామలకి.

"అయ్యగారూ!"

"ఊ."

"అయ్యగారూ! మరీ..."

"ఊ. హూ. ఏమిటా మరి; సరిగ్గా చెప్పు."

"ఈ తోటకి చేరువలోనే నాకు మీరు రాసివ్వదలచుకున్న పొలం ఉందన్నారు కదండీ! ఇవ్వాళ చూపించరా నాకు?"

కళ్ళు అర్ధనిమీలితంగా మూసి ఉంచిన రెడ్డిగారి ముఖం చటాలున ముడుచుకు పోయింది.

మళ్ళీ మొదలెట్టింది శ్యామల. "మన మిక్కడికి చేరీ చేరగానే మొట్టమొదట నా పేర పొలం రిజిస్టరు చేయించితేగాని, మరొక పని ముట్టుకోనన్నారు గదండీ మీరు! మరి అదేం చేశారు?"

ఈ దెబ్బతో రెడ్డిగారి కోడి నిద్ర వదిలిపోయింది. చటాలుమని కుర్చీలోంచి లేచి

నుంచుని, క్రూరమైన చూపుతో-"ఏమిటే...చాలా పెద్ద పెద్ద వ్యవహారాలు మాటాడుతున్నావు? దిక్కూ మొక్కూ లేని నీ బోటి ముండ లందరికీ రాసివ్వటానికే నేమిటి కష్టపడి నే వీ భూములు సంపాదించింది? పిచ్చి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టి నోరు మూసుకు పడుండు." సిగరెట్టు పీకని కింద విసిరి కొట్టి, కసిగా చెప్పు కాలితో నలిపాడు రెడ్డి.

## (19)

పాపిరెడ్డి తారమ్మ పెంచుకున్నట్టు చెప్పుకున్న పడుచు పిల్లతో ప్రేమయాత్రకు వెళ్ళడం, ఆ తరవాత ఆ పిల్లని తీసుకొచ్చి తోటలో పెట్టడం ఊరందరికీ గుప్పుమంటూ తెలిసిపోయింది. నలుగురూ నాలుగు విధాల చెప్పుకో సాగారు.

వృద్ధాప్యం వచ్చి అన్నీ ఉడిగిపోయే దశలో కేవలం డబ్బు మదం వల్లనే అతను ఇంతకు తెగించా డన్నారు. మరి కొందరు మరో రకంగా చెప్పుకోసాగారు. అసలు ఈ నాటకమంతా తారాదే వే ఆడిం దన్నారు. తన విషయాల్లో జోక్యం చేసుకోకుండా వేరే రంధిలో పడి ఉండడం కోసం తారే ఆ పిల్లని ఎక్కణ్ణించో తెచ్చి రెడ్డికి తగిలించిందని తేల్చారు.

లోకులు చెప్పుకుంటున్న వన్నీ తార కర్ణేంద్రియాలకి తాకుతూనే ఉన్నాయి.

శ్యామలని ఊళ్ళోకి రానివ్వక తోటలోనే అట్టిపెట్టడంతో జనం రకరకాల కథలు చెప్పుకుని ఆనందించడానికి మరింత అవకాశ మిచ్చినట్లయింది. ఆ తోటలోంచి కూడా దాన్నెటయినా పంపించేస్తే కాని, జనం నోళ్ళు కట్టుబడవు. అందుకేమి ఉపాయం దొరుకుతుందా అని ఆలోచిస్తున్న సమయంలో పాపిరెడ్డి తోటనించి వచ్చాడు.

వినయ విధేయత లున్న విద్యార్థి లాగ తనకీ, శ్యామలకీ మధ్య నడిచిన సంభాషణ క్రమమంతా పూస గుచ్చినట్టు చెప్పాడు తారతో.

పొలం రాసివ్వమని శ్యామలడిగిందనే మాట

వినగానే తార భగ్గుమంది.

"అమ్మో! దాని కెంత పెద్ద ఆలోచన! అంతా కలిపి వదిహేనేళ్ళు లేవు దానికి... ఆరి తేరి కాపురం చేస్తున్న వాళ్ళకి కూడా తెలియని సంగతులు దానికి తెలుసు. అప్పుడే ఆస్తులు. రాయించుకోవడాలు వరకు వచ్చిందన్నమాట. సరే ఇప్పుడు మన మొక పని చేద్దామండీ!"

"ఏం చేద్దామంటావ్! మంచి ఉపాయాలు నీకే తడతాయి. చెప్పు మరి ఏం చేయాల్నో?"

"ఏం లేదు. ఆ దొంగముండను మనం తోట్లోంచి తప్పించాలి."

"తప్పించి. మరిక దా న్నెక్కడుంచుదా మంటావ్?"

"మనింటికి తీసుకొచ్చెయ్యండి ఇప్పుడే వెళ్ళి."

"మనింటికా. మళ్ళీ రానిస్తావా. తారా. దాన్ని?"

"ఆ...హా... రానిద్దాం. అయితే దాన్ని మనింట్లో ఉంచేసుకుందుకు కాదు: నెమ్మదిగా ఎక్కడికో ఒక చోటికి తో సే సేమార్గం తరవాత చూద్దాం. ముందు వృడు దా న్నిక్కడికి తీసుకొచ్చెయ్యండి."

తరవాత రెడ్డిగారి చెవిలో రెండు మూ డు నిమిషాలు గునగున లాడింది తార. అది వింటున్న రెడ్డి ముఖంలో ఫ్లడ్ లైట్స్ వెలిగాయి.

మరు నిమిషమే బయలుదేరి మళ్ళీ తోటకి చేరుకున్నాడు. మళ్ళీ వచ్చిన రెడ్డిని చూచి శ్యామల నివ్వెరపోయింది.

"ఏమే శ్యామలా! ఇక్క డుండలేను మొర్రో అని ఒకటే గోల చేస్తున్నావు కదూ! అయితే లే. లేచి నీ బట్టలవీ సర్దుకో. వెళదాం."

శ్యామల తన చెవుల్ని తను నమ్మలేకపోతోంది. అయినా. తన కీ చోటునించి విముక్తి కలగబోతున్నందుకు మనసంతా సంతోష తరంగాలతో నిండిపోయింది. మంచంమీద అడ్డదిడ్డంగా పడేసి ఉంచిన తన బట్టల్ని తత్తరపడుతూ మడతలు పెడుతూనే అంది-"అరె! అయితే. ఇల్లు దొరికిందన్న మాట మీ రిక్కడి నించి వెళ్ళే పాటికి. భలే అదృష్టమండీ నాది!"

"నీకు వేరే ఇల్లు తీసుకునే అవసర మిప్పుడు లేదు లేవే! తారమ్మగారే తీసుకు రమ్మాన్నారు నిన్ను. అక్కడికే మన మిప్పు డెళ్ళేది."

శ్యామల నెత్తిమీద పిడుగు పడింది. ఓ క్షణం పాటు గుండె కొట్టుకోడం ఆగిపోయింది. "ఏమిటయ్యగారూ! మీరు చెబుతున్నది? మళ్ళీ తారమ్మగారింటికా? నేనా? ఏ ముఖంతో రాను! సిగ్గులేక నేను బయల్దేరినా. ఆమె నన్ను గుమ్మ మయినా ఎక్క నిస్తారా! మెడ బట్టి గెంటరూ?"

"అలా ఏం కాదే. పిచ్చిదానా! తారమ్మగారి సంగతి నీకు బాగా తెలియదు. ఒట్టి కుక్కపేగుల్ది! నీ మీద దానికి నిజంగా కోపమే ఉంటే స్వయంగా తనే ఎందుకు చెప్పి పంపుతుంది నన్ను- నిన్ను వెంటనే తీసుకు రమ్మని?

నువ్వయినా మరీ చిన్నదానివి. వేరే ఇంట్లోనే ఉంచుతా ననుకో. నాకు చూడబోతే సవా లక్ష పనులు. తీరుబడి దొరికినప్పుడు నీ దగ్గిరికి రావడం తప్ప అన్నప్పుడూ నీ తోనే ఉండను. మరి నీకు దిక్కెవ రుంటారు ఆ ఇంట్లో? కాబట్టి మళ్ళీ తారమ్మగారి దగ్గిరే ఉండు. దాని అండ వదులుకోవటం మంచికాదు నీకు. ఇదివరలో మాదిరిగానే ఇంట్లో పనీ పాటా చూచుకుంటూ ఉండు. మంచి కుర్రాణ్ణెవడి నయినా చూచి నీకు పెళ్ళి చేసి పంపుతుంది." కొంటెగా నవ్వుతూ చెప్పుకు పోతున్నాడు రెడ్డి. ఇకిలించినప్పుడల్లా పళ్ళు మొత్తం బయట బడి తోడేలు నవ్వితే ఇలాగే ఉంటవచ్చునని పిస్తున్నాయి.

రెడ్డి పలుకుతున్న ఒక్కొక్క మాట ఒక్కొక్క సుత్తి దెబ్బలా శ్యామల గుండెల్ని తాకుతున్నాయి. చాలా సేపటివరకూ మూ గబోయి పిచ్చిగా. నిస్సహాయంగా రెడ్డి ముఖంలోకి చూస్తూ ఉండిపోయింది. తరవాత కొంచెం తెప్పరిల్లుతూ—"ఇదేనా. అయ్యగారూ. మీరు నాకు చేస్తానని చెప్పింది? చదువు మానేసి మీ మాట ప్రకారం నడు స్తే మీరు నాకు కలిగిస్తామన్న దర్జా బతుకూ. భోగభాగ్యాలు ఇవేనా? నా కన్నెన్నో చెప్పి. ఏవేవో వాగ్దానాలు చేసి. ఎక్కడెక్కడో తిప్పుకొచ్చి చివరకు మళ్ళీ తారమ్మగారికి పనిమనిషి గానే న న్నప్పగిస్తున్నారన్నమాట."

"అబ్బే... అలా ఏం కాదే! తారకి మాత్రం ఎవరున్నారు? నీ అంత దానికీ అవసరమే. వెనకటిలాగే నీ పనిపాటలతో దాన్ని చక్కగా మెప్పించు- మళ్ళీ నిన్ను ప్రేమగానే చూచుకుంటుంది."

"అమ్మగారు నన్నెంతో బాగా. ఎంతో పైకి చదివిస్తారని నమ్ముకుని చిల్డ్రన్స్ హోమును వదిలేసి వచ్చాను. మీ మాటలు నమ్మి సుఖంగా. వైభవంగా నా జీవితం గడిచిపోతుం దనుకున్నాను. కాని- ఇప్పుడు మళ్ళీ లజ్జ లేకుండా ఆమె



Chhaya/PP/415

ఇంటి నౌఖరుగా వెడుతున్నాను." రెండు చేతుల తోనూ ముఖం కప్పుకుని గుండెలు పగిలేలా ఏడిచింది శ్యామల.

చీకట్లు బాగా పేరుకున్న తరవాత శ్యామల్ని వెంటబెట్టుకుని తారాదేవి ఇంటికి తిరిగి వచ్చాడు రెడ్డి.

## 20

మళ్ళీ తార గుమ్మంలో అడుగు పెడుతున్నప్పుడు శ్యామల గుండె దడదడలాడింది. కాళ్ళు గజగజ వణికాయి. నడక చేతగానిదానిలా తడబడుతూ, తారుతూ ఇంట్లోకి వస్తున్న శ్యామల్ని తారాదేవి క్రీగంట చూ ింది గాని, పలకరించలేదు. శ్యామల బుగ్గలన్నీ జేవురించి, కందిపోయి, కళ్ళు ఉబ్బిపోయి ఉండడాన్ని కూడా గమనించింది తార.

తిన్నగా పెరట్లోకి పోయి, జామచెట్టు మొదలు కానుకుని కూర్చున్న శ్యామల్ని ఎవరూ పలకరించ లేదు.

చాలా ప్రొద్దుబోయాక-అన్నం తినమని కొడుకుతో అడిగించింది తార. తిననన్నట్టుగా శ్యామల తల ఆడించింది. అంతే ఇంక ఎవ్వరూ పట్టించుకోలే దా పిల్లని.

తెల్లారిన దగ్గర్నుంచీ· మళ్ళీ మొదలయ్యింది-గానుగెద్దు జీవితం శ్యామలకి. అంట్లు, తుడుపులు, వడ్డించడాలు, బట్టల చాకిరేవులు-ఒకటిగాదు-సమస్తమైన పనుల్నీ శ్యామల చేతులు యంత్రాల్లా చేసుకుపోతున్నాయి.

జీతంభత్యంలేని పనిమనిషిగా శ్యామల ఉపయోగ పడుతున్నందుకు తారకి హాయిగానే ఉంది.

అయితే, ఎక్కువకాలం అది ఇంట్లో ఉంటే ప్రమాదం. రెడ్డిగారి పిచ్చి కళలు ఆమెకి తెలియనివి కాదు. మళ్ళీ ప్రేమ కలాపం మొదలవుతుంది. కాలం గడిచేకొద్దీ ఇంట్లో దాని స్థానం బలపడొచ్చు. ఇంత చిన్న వయస్సులోనే దానికి ఆ ిస్తిపాస్తుల మీద యావ కలిగినప్పుడు తరవా త్తరవాత నా సంగతేమిటో తేల్చమని నలుగుర్లోకి తమని లాగచ్చు.

ఎందుకొచ్చిన పీడ ఇదంతా? నెమ్మదిగా, జాగ్రత్తగా దీన్ని వదిలించుకోవడం ఉత్తమం.

కార్యరంగంలోకి దూకింది తార. శ్యామలకి రకరకాల ఆంక్షలు విధించబడ్డాయి. బయటి ముఖం చూడగూడ దసలు. రెడ్డిగారితోనేగాదు, తన ప్యాసుతో సయితం మాట్లాడగూడదు శ్యామల.

శ్యామల తినే తిండి మీద కూడ తార అజమాయిషీ ఎక్కువయింది. కాఫీ టిఫిన్లు చే ిసి టేబులమీ దుంచడంవరకే శ్యామల పని. అంతా ఆరగిస్తారు. మిగిల్తే ముష్టివాళ్ళ కేస్తుంది తార. శ్యామలమాత్రం తినడానికి వీల్లేదు. ఇదివరకులా, స్వయంగా అన్నం పెట్టుకు తినగూడదు. తారమ్మ పెట్టినప్పుడే తినాలి.

చాలీ చాలకుండా పెడుతోంది తార. పాచి కూరలు పనిగట్టుకుని శ్యామల కేస్తోంది. మజ్జిగసలు పొయ్యదు. ఒక్కోసారి కూరలుకూడా ఉండవు. చింతకాయ పచ్చడితోనే అన్నమంతా తిని ముగించాలి.

శ్యామలకి పెడుతున్న అన్నం రోజు రోజుకీ తగ్గిపోతోంది. చాకిరీ పెరిగిపోతోంది.

నిరంజన్ నిఘా కూడ ఎక్కువయ్యింది శ్యామల మీద. తన తండ్రి ఆ ముండతో ఎక్కడ మాట్లాడతాడోనని వెయ్యి కళ్ళతో కనిపెట్టి చూస్తున్నాడు. వదిలిపోయింది గదా అనుకున్న శని మరలా ఇంట్లోకొచ్చి కూర్చున్నందుకు మహా మంటగా ఉంది అతనికి. సాధింపు మళ్ళీ మొదలు పెట్టాడు. చిన్న కారణం దొరికితే చాలు-శ్యామల్ని కొట్టడానికి మీదమీద కొస్తున్నాడు.

ఇంట్లో అందరికీ తను శత్రువే. రెడ్డిగారు సొంత ఊళ్ళోనే ఎక్కువగా ఉండిపోతున్నారు. ఎప్పుడయినా వచ్చినా-వెంటనే తిరిగి వెళ్ళిపోతున్నాడు.

ఇరుగు పొరుగుల్తో నయినా తను పడుతున్న బాధల్ని చెప్పుకుని ఓదార్పు పొందుదా మనుకుంటుంది శ్యామల. అయితే, ఆ అవకాశం కూడ లే దా పిల్లకి. ప్రక్కింటి వాళ్ళేగాక క్వార్టర్సులో ఉన్న ప్రతి ఒక్కరూ ఆమెని ఒక చీడ పురుగులా చూస్తున్నారు. లోకం భయంకర క్రీకారణ్యమయ్యింది శ్యామలకి. అందులో దారితప్పిపోయిన ఒంటరి లేడి కూన తను.

ఇప్పటివరకూ శ్యామలకి కొన్ని మంచి నమ్మకాలుండేవి చదువుకున్న వాళ్ళ మీద. గొప్ప చదువులు, ఉద్యోగాలు ఉన్న వాళ్ళకి గొప్ప మనసులుంటాయనీ, పేదవాళ్ళ పట్ల ఎంతో ఆదరణ చూపుతారనీ అనుకునేది. ఇప్పు డర్థమవుతోంది. వాళ్ళు ప్రదర్శించే ప్రేమల్లో, అభిమానాల్లో ఎంత స్వార్థం, ఎంత నైచ్యం దాగి ఉంటుందో!

తార ఇల్లు ఒక బంధిఖానా తనకి! ఇ దో ఉక్కు పంజరం! ప్రతి ఒక్కరికీ తనంటే పరమ అన



daCunha/AS/27/84/TL

హ్యాం. నోరు విప్పి ఒక్క మాట మాట్లాడుదామన్నా ఎవ్వరూ లేరు తన కిక్కడ.

బాధలతో. హింసలతో రెండు నెలలు గడిచిపోయాయి శ్యామలకి.

ఓ ప్రక్క సహింప శక్యంగాని ఆకలి జ్వాల! మరోప్రక్క శక్తికి మించిన వెట్టి చాకిరీతో నలిగిపోతూ. సతమతమవుతూ కాలం నెట్టుకొస్తున్న శ్యామలలో ఒక విధమైన తెగింపు. మొండిధైర్యం వచ్చింది.

ఇక ఒక్క క్షణం కూడ ఎవరిమీదా ఆధారపడదు తను. కష్టపడి బ్రతుకుతుంది. ఏ కూలో నాలో చేసుకుంటుంది. స్వతంత్రంగా బ్రతుకుతుంది. అదెంత సుఖమైన బ్రతుకు?

ఎరుకల గూడెంలో తన తండ్రి తాలూకు చుట్టా లుండాలి. వాళ్ళ అండకు చేరితే ఆదరించకుండా ఉండరు. వాళ్ళ మధ్యలో ఉంటూ వాళ్ళతో కలిసి కష్టం చేసుకుంటూ బ్రతకొచ్చు. ఉన్ననాడు తింటుంది. లేని నాడు కాళ్ళు ముడుచుకు పడుకుంటుంది. ఈ హింస. వెట్టిచాకరీ ఇక తట్టుకోలేదు.

## 21

శ్యామల ఎరుకల గూడెం వచ్చేసింది. శ్యామల స్థితికి గుడి సెల్లో ఉన్నవాళ్ళంతా విపరీతంగా జాలిపడ్డారు: బాధపడ్డారు.

శ్యామల పసిపిల్లగా చిల్డ్రన్సు హోములో జాయినవుతున్నప్పుడు అందరూ ఎంతో సంతోషించారు. గవర్నమెంటు అధికారుల చేతుల్లోనే పిల్ల శుభ్రంగా చదువుకుని. ఉద్యోగస్థురాలై. వాళ్ళ చేతలమీదుగానే ఒకింటిదై సుఖంగా బ్రతుకుతుంది కదా అని ఆశపడ్డారు. ఇప్పుడు మళ్ళీ అతిదీన స్థితిలో తమ గుడి సెల్లోకే వచ్చి చేరిన శ్యామల్ని చూచి నిస్సహాయంగా నిట్టూర్చారు.

దగ్గరి చుట్టాలయిన వాళ్ళు నాలుగు రోజులపాటు ఆదరించగలిగారు శ్యామలని.

ఆ ఊరి బస్టాండు గుడి సెలకు చేరువగానే ఉంది. కాలగతిలో అది మంచి బిజీ సెంటరయ్యింది. నాలుగు రోడ్ల కూడలి కావడంవల్ల క్షణక్షణానికీ నాలుగు వైపులనుంచీ బస్సులు. లారీలు. జీపులు లెక్కకు మించి వస్తుంటాయి. ఇప్పుడు బస్టాండనడం మానేసి జంక్షన్ అంటున్నారు దాన్ని. ఆ చోటలో ఐదారు కిల్లీ దుకాణాలు. మూడు నాలుగు హోటళ్ళు లేచాయి. అవన్నీ రేయింబవళ్ళూ యమ రద్దీగా ఉంటాయి.

అలాంటి ఒకానొక హోటల్లో శ్యామలకి పని దొరికింది. అంట్లు తోమి. పప్పు రుబ్బినందుకు నెలకి ముప్ఫయి ఇస్తున్నారు. సర్వర్లందరితోపాటుగా కాఫీ. టిఫిన్లు ఇస్తున్నారు.

కష్టపడి పనిచేస్తోంది శ్యామల. త్వరలోనే హోటలు యజమానికీ. తోటి పనివాళ్ళకీ ఆ పిల్ల మీద అభిమానం కలిగింది. సర్వరు కుర్రాళ్ళవాళ్ళతోనూ అవసరమయితే తప్ప మాట్లాడకుండా. మౌనంగా తన పని తాను చేసుకు పోతున్న శ్యామలపట్ల అందరూ గౌరవంగా మెలుగుతున్నారు.

హాయిగా గడిచిపోతున్నాయి రోజులు! ఇన్నాళ్ళకి ఇప్పుడు కడుపునిండా తిని. కంటినిండా నిద్రపోగలుగుతోంది శ్యామల.

సర్వరు షణ్ముగానికిమాత్రం రోజూ పడుతున్న నిద్ర- శ్యామల పనిలో చేరిన నాటినించి దూరమైంది. ఆ అమ్మాయి రూపం. ఒంటి రంగు. పొంకమైన అవయవాలు షణ్ముగం మతి పోగొట్టాయ్. సినిమాపిచ్చి జాస్తి అతనికి. శ్యామల్లో అతనికి సినీమా తారల కళ లెన్నో అగపడుతున్నాయి. ఆ పిల్ల ప్రతి కదలికా ఒక భంగిమ. ఆమె ప్రతి మాటా మధుర సంగీతం. ఆమెది నడక కాదు... మనోహర నృత్యం.

శ్యామల అందచందాల నారాధిస్తున్న షణ్ముగం కొద్దిరోజుల్లోనే ఆమె భక్తుడయ్యాడు.

ఇద్దరికీ పరిచయమయ్యింది. అది స్నేహంగా కూడ మారింది.

## 22

శ్యామల పనిలో జేరి ఆరు నెల లయ్యింది. ఆరు నెలలు గడిస్తే వారు వీరవుతారనే జనవాక్యం శ్యామలా—షణ్ముగాల విషయంలో నిజమయ్యింది.

ఒకరి సుఖదుఃఖాల్ని మరొకరితో పంచుకున్నారు. జీవిత గాథల్ని ఒక్క పిసరు కూడ దాచుకోకుండా ఒకరితో ఒకరు చెప్పుకున్నారు.

చివరకు ఒకరి మనస్సు ఒకరికి ఇచ్చుకున్నారు.

బ్రతుకుబాటలో చివరి మజిలీవరకూ చేయి చేయి కలుపుకొని ముందుకు పోదామని ప్రమాణం తీసుకున్నారు.

సంగతి తెలుసుకున్న హోటలు ప్రొప్రయిటరు. సాటి సర్వర్లు మనస్ఫూర్తిగా సంతోషించారు. శ్యామల చుట్టాలకీ ఆనందమయ్యింది. ఇంత సులువుగా శ్యామల బ్రతుక్కి ఓ దిక్కొకటి దొరుకుతుందని ఊహించి ఉండలేదు వాళ్ళు.

ద్వారకా తిరుమల దేవుడి ముందు అందరి సమక్షంలో శ్యామలా-షణ్ముగాలు దంపతు లయ్యారు.

హోటలుకు దగ్గరగా చిన్న ఇల్లు అద్దెకు తీసుకున్నారు. మంచిరోజు చూసుకుని గృహప్రవేశం చేశారు. వాళ్ళ దాంపత్య జీవితం చూచే వాళ్ళకి ఎంతో ముచ్చట గొల్పుతూ సాగుతున్నది.

షణ్ముగానికి తను చంద్రమండలంలోకి ఎగిరిపోతున్నట్టూ. శ్యామలకి తను ఆకాశపు అంచులు దాటి పాలవెల్లి పుంతల్లో విహరిస్తున్నట్టూ అనుభూతి కలుగుతూ ఉంది.

రోజూ తెల్లవారుఝాము ఐదింటికి హోటలుకొచ్చేస్తారు ఇద్దరూ. శ్యామల అంట్ల పని చూసుకుంటూ ఉండగా. షణ్ముగం నిమిషంలో పప్పు రుబ్బేస్తాడు. శ్యామల్ని బొత్తిగా రుబ్బనివ్వడు.

"కొత్త పెళ్ళాం కందిపోతుందని గాబోలు షణ్ముగం గాడి భయం. ఇంత చురుకుదనం ఇదివరకెప్పుడయినా వీడిలో చూశామటోయ్. వీర్రాజూ!" బావనోళ్ళ కుర్రాడు భైరవ శాస్త్రి విస్తూర పోయాడు.

"పెనవుసు! నేనూ అదే సూస్తా ఉండా. కొత్త పెళ్ళాం మొకమే అనుకున్నా వేటి-మనసుపడి చేసుకున్న ముద్దుల పెళ్ళాం కూడాను. అతకి ఏనుగు సత్తువచ్చి 'నావాడంటె రాదా మరి!" కన్ను గీటుతూ ఇకలిస్తాడు ఈర్రాజు.

చైత్రమాసంలో శ్యామల పెళ్ళయితే మూడు నాలుగు నెలలకి పొలాలన్నీ ఊడ్చారు.

చూస్తూ ఉండగానే వరిపొలాలు లేతపచ్చ నించి ముదురు పచ్చగా మారిపోయాయి. నాటిన వరి మొక్కలు చేతి కమురసంతగా దుబ్బులు గట్టి పొలాలన్నీ దిగంతాల వరకు పరచుకున్న పచ్చ కంబళిలా కనబడుతున్నాయి.


కోతల సమయమొచ్చింది. పచ్చని వరి దుబ్బులు ఎండిపోయి బంగారు రంగులోకి మారాయి. వరి కంకులు. గింజలు-అన్నీ బంగారు రంగే. నేరు లోలకబోతున్నది భూ మాత.

కోతలు. కట్టివేతలు కూడ అయిపోయాయి. ఈ తరుణంలో వరి మళ్ళు నిండా జనుము. అవి మొక్కలు దట్టంగా పెరిగి పసుపు పచ్చని పూలతో తల లూగిస్తున్నాయి. ఉండుండి పసురుగా వరిగెట్టి వస్తున్న పైర గాలుల తాకిడికి పూలబాలలన్నీ నిలువెల్లా ఊగి. తూగి సోలిపోతూ గాలి దూరంగా జరిగిపోగానే లేచి నిటారుగా నిలబడుతున్నాయి.

వరిచేల మధ్య ధీమాగా నిలబడిన వరి కుప్పలు రైతుల గుండెల్లో కొత్త ఆశలు నింపుతున్నాయి.

శ్యామల- షణ్ముగంల వివాహ జీవితంలో సంవత్సర కాలం హాయిగా. సాఫీగా గడిచిపోయింది.

కాలంతో. లోకంతో వాళ్ళిద్దరికీ సంబంధంలేదు






పనిచేసినంతకాలం కష్టపడి ఒళ్ళు దాచుకోకుండా పనిచేస్తారు. పనయిపోయి తీరిక దొరగ్గానే పావురాల జంటలాగా గూటికి జేరి ఏమిటేమిటో గునగునా మాట్లాడుకుంటూ ఉంటారు. మాటల మధ్యలో ఫకాలుమంటూ నవ్వుకుంటారు. జీవన మాధుర్యాన్ని కొత్త కొత్త రుచులతో ఒకరికొకరు అందించుకుంటూ ఉండడం తప్ప మరొకటేదీ తెలియడం లేదు వాళ్ళకి.

## 23

షణ్ముగం తండ్రి దొరైసామి కొడుకుని చూచిపోదామని వచ్చాడు. చెంగల్పట్టు జిల్లాలో ఒక చిన్న గ్రామం వాళ్ళది. వర్షాధారంతో పండే రెండెకరాల మెట్ట పొలముంది. ఏటేటా తొలకరి కురియడంతోటే ఏ అయ్య దగ్గరో అప్పు తెచ్చి దున్ని, దోకి నాట్లువేయిస్తూ పండిన నాలుగు గింజలూ తింటూంటారు.

నాలుగు సంవత్సరాలనించీ ఆ ప్రాంతంలో చినుకనేది రాలక పంటలు పండడం లేదు. ప్రతి ఏడూ అప్పు తెచ్చి పొలానికి పెట్టుబడి పెట్టడం. నాట్లు పూర్తయిం దగ్గర్నుంచీ ఆకాశానికి కళ్ళప్పగించి చూడ్డం... ఎన్నాళ్ళు చూచినా బట్ట తడుపు జల్లులుకూడా పడకపోవడంతో నాటిన మొక్కలు ఇలగరుచుకుపోయి, ఎండి మట్టితో కలిసిపోతున్నాయి. దేశమంతా కరువు కాటకాలతో బీభత్సంగా మారింది.

తల్లీదండ్రీతో కలిపి ఆరుగు రున్న కుటుంబం షణ్ముగం వాళ్ళది. దిన వస్తులతో. దిగుళ్ళతో చిక్కి శల్యమయిపోతున్న అమ్మా నాన్నల్ని. తమ్ముళ్ళూ. చెల్లెళ్ళను గమనిస్తున్న షణ్ముగం ఎక్కడికయినా సరే వెళ్ళిపోయి ఏదో ఒక పని సంపాదించి. కుటుంబాన్ని ఆదుకోవాలని దేశం మీదికి బయలుదేరాడు. అలా అలా కొట్టుకొచ్చి హొటలు సర్వరుగా కుదిరి తను బ్రతుకుతూ. నెలకి పాతికో పరకో తండ్రికి పంపుతూ వస్తున్నాడు.

ప్రతి ఏడూ పొలంలో పెట్టుబడికే గాని. ఇంట్లో తిండికేగాని నాలుగేళ్ళనించీ దొరైసామి చేస్తూ వచ్చిన అప్పు ఐదో ఏటికల్లా అతని రెండెకరాల పొలాన్ని హరించగలిగింది. అప్పిచ్చిన షావుకారుకి పొలం దఖలుపరచి. కళ్ళలో ఊపిరి నిల్పుకొని కొడుకును వెదుక్కుంటూ వచ్చాడు దొరైసామి.

తీరా వచ్చి చూడగా కొడుకు పరిస్థితి తారుమారుగా కనుపించింది. తమకి తెలియకుండా కొడుకు తనంత తాను పెళ్ళి చేసుకున్నందుకు మనసు గాయపడింది దొరైసామికి. కొడుకు చేసిన పనితో అతని అహమూ. పెద్దరికమూ బాగా దెబ్బతిన్నాయి.

ఇక కోడలి పుట్టుపూర్వోత్త[illegible] వివరాలు-పుండు మీద కారం జల్లినట్టున్నాయి. పోయి పోయి ఎరికలదాన్ని తన కొడుకు పెళ్ళాడ్డం సహింపని దయిం దతనికి.

ఏమయినప్పటికీ తన అ[illegible]నిగాని. అనహానాన్నిగాని కొంచెమయినా బ[illegible]టకి చూపించ లేదు దొరైసామి. తమ పొలం అప్పులవాళ్ళ పాలై పోయిందనీ. తన తల్లీ. తమ్ములూ. చెల్లెళ్ళూ అన్నం మొగం చూచి చాల రోజు లయ్యిందనీ తండ్రి చెప్పినప్పుడు షణ్ముగం నీరై పోయాడు. ఇంటికి పెద్దకొడుకయిన తను వాళ్ళందరినీ వదిలిపెట్టి ఇక్కడ హాయిగా బ్రతుకుతున్నాడు. పెళ్ళి చేసుకున్న తరువాత నెలనెలా ఇంటికి పంపుతూ ఉండిన డబ్బు తగ్గిపోతూ వచ్చింది.

తనేదో నేరం చేసినట్టూ. తల్లీదండ్రికి అపచారం చేసినట్టూ మథనపడిపోయాడు షణ్ముగం.

ఇంతటి గడ్డుకాలంలో కొడుకు తనకు చేదోడుగా ఉంటే-తమ దేశంలోనే చిన్న హొటల్ లేదయినా తెరిచి కుటుంబాన్ని పోషించుకోగల మన్నాడు దొరైసామి. తండ్రి ఆలోచన సమంజసమైందిగా తోచింది షణ్ముగానికి.

అయితే మరి శ్యామల సంగతేమి కావాలి? తల్లీ. బంధువులూ ఆమెని రానిస్తారా? ఇంటి కోడలుగా అంగీకరించి ఆదరిస్తారా?

సందేహాన్ని తండ్రి ముందు పెట్టాడు. షణ్ముగం కొడుకు భయపట్టం చూచి-దొరైసామి పకా పకా నవ్వి కొడుకు భయాన్ని. సందేహాన్నీ మూడు నిమిషాల్లో ఎగరగొట్టేశాడు.

ముందుగా తా మిరువురూ సొంత ఊరి కెడతారు. మున్సబు దొర కాళ్ళ మీద పడి అప్పు పుట్టించుకుని. దగ్గరే ఉన్న చెంగల్పట్టులో హొటలు తెరవడానికి అవసరమయిన ఏర్పాట్లన్నీ పూర్తి చేస్తారు. అవన్నీ అయ్యాక షణ్ముగం మళ్ళీ వచ్చి శ్యామల్ని వెంటబెట్టుకొస్తాడు తమ ఊరికి. షణ్ముగం తల్లికీ. బంధువులకీ నచ్చజెప్పి శ్యామలని కోడలుగా అంగీకరించేట్టు చేసే పూచీ దొరైసామిది.

తండ్రి మాటలకి షణ్ముగం పొంగిపోయాడు. అతనంటే ఎన్నడూ కలగనంత గౌరవం కలిగింది.

ఆ రాత్రి శ్యామలతో సంగతంతా చెప్పాడు. ముందుగా తండ్రీ. తనూ వెళ్ళి హొటలు ఏర్పాట్లన్నీ పూర్తి చేసుకుని. చెప్పకుండా తను పెళ్ళి చేసుకున్నందుకు కోపంతో అలిగి కూర్చునే తల్లికి అన్ని విషయాలూ నచ్చ చెప్పుకుని తిరిగి పదిహేను రోజుల్లో వచ్చి శ్యామలని తీసుకెడతానని చెప్పి ఒప్పించాడు.

తను లేందే నిమిషం గడవలేని షణ్ముగం. తనని వదిలి బ్రతకనే లేడని శ్యామల గట్టి నమ్మకం. చెప్పిన గడువుకన్నా ముందే వచ్చి తనని తీసికెళ్ళిపోతాడని విశ్వసించింది శ్యామల. కొద్దిరోజుల తరువాత తను చేరుకోబోతున్న అత్తవారిల్లు. తన అడబడుచులు. మరుదులు. ఆ ఊరు. ఆ ఊరి అందచందాలు-అన్నీ ఊహా చిత్రాలుగా శ్యామల మనో ఫలకం మీద కదులాడసాగినాయి.

## 24

షణ్ముగం వెళ్ళి అప్పుడే నెల గడిచింది. అనుకున్నంత త్వరగా. సులభంగా ఏ పనులూ అవ్వవు. హొటలు తెరిచే ఏర్పాట్లు పూర్తవడమంటే మాటలు కాదు. అందుకే అతను రావడం ఆలస్యమయి ఉంటుంది అని అనుకొంటున్నది శ్యామల.

రెండో నెల పూర్తి కావస్తున్నా షణ్ముగం నించి కనీసం ఉత్తరమయినా లేదు. శ్యామల మనసులో అసలు ఉత్తరం రావాలనే తలంపు లేదు. మెరుపు మల్లే అతనే ఏదో ఒక క్షణంలో వచ్చి తన చేతుల్లో వాలిపోతాడనే పిచ్చి భ్రమ ఆమెను వదలడంలేదు.

ఏ రోజు కా రోజు ఆశగా. ఆర్తిగా భర్త రాకకై ఎదురుచూస్తోంది.

నిద్రలేని రాత్రులు బరువుగా. బలవంతంగా గడుస్తున్నాయి. ఎవరి కెన్ని బాధలు. చింతలు ఉన్నా క్షణం క్షణం ఎంత క్రుంగిపోతున్నా కాలం ఎవరికోసమూ ఆగిపోదు. షణ్ముగం వెళ్ళిపోయి అప్పుడే ఆరు నెల లయ్యింది.

శ్యామల మనస్సు కరుడుగట్టిపోయింది.

అసలీ లోకం ఎందుకిలా తనని దగా చేస్తున్నది?

నిండు మనసుతో నమ్మడమేనా తను చేస్తున్న పాపం! శ్యామల ఆలోచించడం మానేసి యాంత్రికంగా హొటలు తాలూకు పనులు చేసుకుంటూ పోతున్నది.

ఇప్పుడు శ్యామల విషయంలో సర్వరు కుర్రవాళ్ళ ప్రవర్తన మరొక రకంగా ఉంటోంది. ప్రతివాడూ శ్యామల్ని ఏదోవిధంగా కదిపి మాట్లాడాలని చూస్తున్నాడు. మితిమీరిన చనువు తీసుకుందుకు ప్రయత్నిస్తున్నారు. పైడితల్లి అనే వాడు శ్యామల కనబడగానే సినిమాల్లో బూతు పాటల్ని లంకించుకుని ఓసరుకి వినబడకుండా శ్యామల చుట్టూ తిరుగుతూ పాడుతూ ఉంటాడు. ఇంకో జిడ్డుగారే సర్వరు సూటీ పోటీ మాటల్తో శ్యామల్ని హింసిస్తూంటే మిగిలిన వాళ్ళంతా విరగబడి నవ్వుతూ

ఆనందం పంచుకుంటూ ఉంటారు.

తెల్లారి లేచిం దగ్గర్నుంచీ రాత్రి ఇంటికి చేరుకునేవరకూ గుంట నక్కల మధ్యన. తోడేళ్ళ మధ్యన గడుపుతున్నట్టు ఉంటోంది శ్యామలకి. ఆమె చుట్టూ ఆమెకంటూ ఉన్న సంఘం. ఈ హొటల్ కుర్రాళ్ళూ. ఖాతాదార్లూనూ. మోసపోయిన శ్యామలను. దగాపడిన శ్యామలను ఒక్క మంచి మాటతో ఒక్కరయినా ఓదార్చకపోగా రకరకాల అవహేళనలతో ఆమె గుండెను తూట్లు పొడుస్తున్నారు.

శ్యామల కిదంతా దుస్సహంగా ఉంది. దుర్భరంగా ఉంది. గోరుచుట్టు మీద రోకటిపోటులాగుంది.

ఈ మృగాల మధ్య బ్రతికి నెగ్గలేదు తను.

హొటలుపని కాకపోతే మరెన్ని పనులు లేవు కష్టపడే వాళ్ళకి!

## 25

మళ్ళీ ఎరుకల గూడెమే శ్యామలకు ఆశ్రయమిచ్చింది. చుట్టుపట్ల గుడి సెల అడవాళ్ళతో కలిసి పొలాల్లో కూలీకీ. నాలీకీ వెడుతోంది. పనులకాలం గడిచిపోయాక-చేద్దామన్నా పని దొరకని గడ్డు రోజుల్లో శ్యామల పస్తులు పడుకుంటున్నది.

ఇరుగు పొరుగు వాళ్ళని చూచి. వాళ్ళకిలాగానే తనూ నాలుగు పంది పిల్లల్ని కొని. పెద్దవయ్యేవరకూ మేపి. అమ్మడం నేర్చుకుంది. అయినా ఆకలి దగ్గరి చుట్టంలా ఆమెని వదిలిపో నంటున్నది.

ఇహ ఇప్పుడు శ్యామల పదహారణాల అనాథ. పైగా అందచందాలు పుష్కలంగా ఉన్న అనాథ.

ఆమె చుట్టూ ఉన్న వాళ్ళకి గొప్పోళ్ళ లాగా నీతులు. కట్టుబాట్లు అంతగా లేవు. అసలు వాటిని గురించి ఆలోచించే తీరుబడే వాళ్ళకుండదు. ఆలోచనలు వాళ్ళకి బువ్వ పెట్టవు మరి.

గొప్పోళ్ళకి మాత్రం నీతీ నిజాయితీ లంటూ పట్టుకు కూర్చుంటే పనులెట్టా అవుతాయి? పరపతీ. డబ్బూ. హోదా పెంచుకోదలచిన వాళ్ళు నీతి. న్యాయం అంటూ కూర్చుంటే ఇహ అయినట్టే!

కూలి డబ్బులు దొరక్క చేతిలో పైసా లేక ఆకలి మహమ్మారితో కొన్ని రోజులు పోరాడుతూ. డబ్బులుండీ కడుపునిండా తింటున్న సమయంలో కూడా వయస్సు పెట్టే అలజడితో. కాల్చుకుతినే సహజ వాంఛలతో మరి కొన్ని రోజులు పోరాడుతూ గడుపుతోంది శ్యామల.

చాలాకాలంవరకూ శక్తికొద్దీ పోరాడింది. చుట్టుపక్కల అమ్మలక్కలు. చుట్టపక్కాలనుకున్న వాళ్ళు ఆమెకి సులువుగా. ఏ బాధలు పడకుండా జీవించే ఉపాయాల్ని బోధించడం మొదలు పెట్టారు.

అసలు అన్నింటికన్నా ముందు ఏ వయసులో ముచ్చట ఆ వయసులో తీర్చుకోవాలన్నారు. వయసూ. అందమూ ఇప్పుడు వృధా చేసుకుంటే తిరిగి రా వన్నారు. ఈ అదనులోనే నాలుగు రాళ్ళు సంపాదించుకుని దాచుకుంటే ముందు ముందు వయసుడిగి. శక్తి నన్నగిల్లాక అక్కరకొస్తాయన్నారు. ఏ దిక్కూలేని శ్యామలకి తన సంపాదనే దిక్కవుతుందని పదే పదే నూరిపోశారు.

జీవితం పొడుగునా దరిద్రాన్నే వరించి. నికృష్టంగా బ్రతకగల శక్తిగానీ, అన్నీ చంపుకుని పవిత్రంగా జీవించాలనే సంకల్పంగానీ శ్యామలకి లేవు. ఉండవలసిన పనికూడా లేదు.

సమాజమనే వధ్య శిల మీద నిస్సహాయంగా తలవాల్చిన మేకపిల్ల శ్యామల!

ఇప్పుడు ఊళ్ళో స్టూడెంటు కుర్రాళ్ళకీ, ఆ ఊరూ ఈఊరూ నించి వచ్చే బస్సు కండక్టర్లకీ. లారీ డ్రైవర్లకీ శ్యామల గుడిసె ఇంద్రలోకంగా మారింది.

తారాదేవి దేశంలో స్త్రీజాతి మీద జరుగుతున్న అత్యాచారాన్ని గురించి. ఆడవాళ్ళని అంగడి సరకుగా మార్చుతున్న మన సమాజపు క్రౌర్యాన్ని గురించీ, మహిళల సమున్నతికోసం తీసుకోవలసిన కార్యక్రమాల్ని గురించీ మహిళా సంఘాల సమావేశాల్లో ఉద్ఘాటిస్తూనే ఉంది. స్త్రీ సంక్షేమ పథకాలు గ్రామ గ్రామాన ఎలా జయప్రదంగా అమలు చేయబడుతున్నదీ తెలియజేసే ప్రోగ్రెసు రిపోర్టులను ప్రతి నెలా సమితి సర్వసభ్య సమావేశాల్లో చదువుతూనే ఉంది.

తారాదేవి సేవల్ని, సమర్థతను గుర్తించి ఈ మధ్యనే అమెని పై అధికారులు జిల్లా స్త్రీ సంక్షేమ అధికారిణిగా ప్రమోట్ చేశారు.

(సమాప్తం)

